RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -240 పేజీలు - 08 వెల - 04/- బుధవారం2 జులై 2025

# పేదలను ఆదుకునేలా పేదల సేవలో కార్యక్రమం

## 2029కల్లా పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం: సీఎం

- ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వడంతో ప్రజల్లో ఆనందం
- గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదు
- వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ఎప్పుడూ చూడలేదు
- నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటన
- మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**రాజమండ్రి, జూలై 1ఆంధ్ర ప్రగతి :** పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని.. ఈ కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వటం వల్ల ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. నూటికి 13 మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొచ్చారు. మిగతాది 2లో...



## మరోమారు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర

### కూటమి అక్రమాలను ఎండగట్టడమే లక్ష్యం

-వైసీపీ యూత్ వింగ్‌తో భేటీలో జగన్ ప్రకటన



**అమరావతి,౧ జూలై 1ఆంధ్ర ప్రగతి :** మరోమారు రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి అధికార కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తానని వైకాపా అధినేత జగన్ ప్రకటంచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలవడానికి ప్రధాన కారణాల్లో వైఎస్ జగన్ సుదీర్ఘ పాదయాత్ర ఒకటి అని నిస్సందేహంగా చెప్పుచ్చు. 3 వేల 648 కిలోమీటర్ల మేర 341 రోజులు జరిగిన ఈ పాదయాత్ర ఒక ట్రెండ్ సెట్టర్ అని చెప్పాలిమిగతాది 2లో...

## వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత

- సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మిక మరణం
- హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన పట్టాభిరామ్
- ప్రముఖ ఇంద్రజాలికుడిగా, సైకాలజిస్టుగా గుర్తింపు



2లో

# నం.1 రాష్ట్రంగా ఏపీ

- బీజేపీ కొత్త రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆకాంక్ష
- సీనియర్ నాయకుల సమక్షంలో బాధ్యతలు
- బాధ్యతలు అప్పగించిన పురందేశ్వరి

**అమరావతి, జూలై 1ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు. రాష్ట్రం మరోసారి విభజన గాయాలకు గురికాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, భాష, వారసత్వంపై ప్రతి ఒక్కరిలోనూ చైతన్యం రావాలనీ, 'ఇది నాది' అనే భావన పెరగాలనీ ఆయన సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా మాధవ్ పేరును కర్ణాటక బీజేపీ ఎన్నికల పరిశీలకుడు, బెంగళూరు ఎంపీ పీసీ మోహన్ మంగళవారం అధికారికంగా ప్రకటించారు.మిగతాది 2లో...




## సింగయ్య మృతి కేసులో జగన్‌కు ఊరట

రెండు వారాలపాటు చర్యలు నిలిపివేత

హైకోర్టు ఆదేశాలు



2లో

# కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..

## తెలంగాణ జలాల విషయంలో వెనక్కి తగ్గేది లేదు: రేవంత్ రెడ్డి

- ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్
- రాష్ట్ర నీటి హక్కుల కోసం రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని వెల్లడి
- ఏపీ ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే తెలంగాణ ప్రాజెక్టులు పట్టించుకోలేదని వ్యాఖ్య

2లో




## కార్యకర్తల త్యాగం వల్లే ఈ స్థాయికి...

### కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి

బిజెపి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు




2లో

# పేదలను ఆదుకునేలా
# పేదల సేవలో కార్యక్రమం





**(మొదటి పేజీ తరువాయి)**సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఏపీని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తామని అన్నారు. గతంలో వ్యవస్థలన్నీ పడకేశాయని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం.. ఆదాయం పెంచుతామని' వెల్లడించారు. పెరిగిన ఆదాయం పేదలకు పంచి అభివృద్ధికి ఖర్చు పెడతామని చెప్పుకొచ్చారు. తన తల్లి పడిన కష్టం ఏ మహిళకూ ఉండకూడదని ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు చంద్రబాబు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పింఛన్లు ఇచ్చేటప్పుడు ఉద్యోగులు సేవా భావంతో ఉండాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో పేదవారిని చులకనగా చూస్తే సహించనని హెచ్చరించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కష్టపడుతున్నానని తెలిపారు. మానవత్వంతో దివ్యాంగుల కోసం 12 రెట్లు పింఛన్లు పెంచామన్నారు. రాజకీయ ముసుగు వేసుకొని ప్రజాధనాన్ని దోచుకుంటే సహించనని వార్నింగ్ ఇచ్చారు. ఎన్డీయే కార్యకర్తలు దగ్గరుండి మరీ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పరిశీలించాలని ఆదేశించారు. 'డ్రగ్స్, గంజాయి విక్రయించే వారి తాట తీస్తా. ఆడబిడ్డపై చేయివేసే వారికి అదే చివరి రోజు. రౌడీయిజాన్ని సహించను' అని తీవ్రంగా హెచ్చరించారు. 'సాధారణ కుటుంబంలో పుట్టి దేవుని కృప వల్ల అంచెలంచెలుగా అభివృద్ధి చెందాం. డాక్టర్ అంబేద్కర్ సాధారణ కుటుంబం నుంచి జన్మించి తరతరాలు గుర్తుండే రాజ్యాంగాన్ని రచించారు. లక్ష బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. రూ.10లక్షల కోట్ల అప్పులు తీర్చాలని' అన్నారు. పోలవరాన్ని వైసీపీ భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని 2027కి పూర్తి చేసే అదృష్టం దేవుడు తనకే ఇచ్చారన్నారు. డిసెంబర్ నాటికి డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. గోదావరి పుష్కరాలు మూడోసారి తానే చేయబోతున్నానని.. కనీవినీ ఎరగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.రాజకీయాల్లోకి రౌడీలు వస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. పాయకరావుపేట హాస్టల్‌లో సరిగ్గా భోజనం పెట్టని ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. వివేకా మృతిపై ఆయన కుమార్తె అనుమానం వ్యక్తం చేస్తే గొడ్డలి పోటుగా నిర్ధారించామని అన్నారు. రౌడీషీటర్‌ను పలకరించటానికి జగన్ వెళ్లి రౌడీయిజం చేశారని ఫైర్ అయ్యారు. జగన్ కారు కిందపడి చనిపోతే కుక్కను లాగినట్టు పక్కన లాగి పాడేశారన్నారు. 'నా జీవితంలో నేను ఎక్కడా ఎవర్ని కొట్టలేదు, నాపై కేసులు లేవు. ప్రజలను కాపాడేందుకు నేరస్తులతో రాజకీయ పోరాటం చేస్తున్నా. నేరస్తులకు ఓటు వేసి గెలిపిస్తారా' అని సీఎం ప్రశ్నించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆగస్టు 15 నాటికి నూరు శాతం సేవలు అందిస్తామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది తలసరి ఆదాయం రూ.30వేలు పెంచామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## సింగయ్య మృతి కేసులో జగన్‌కు ఊరట
### రెండు వారాలపాటు చర్యలు నిలిపివేత
### హైకోర్టు ఆదేశాలు

అమరావతి, **జూలై 1 ఆంధ్రప్రగతి :**
సింగయ్య మృతి ఘటనలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి ఊరట దక్కింది. జగన్‌తో పాటు ఇతరులపై నమోదైన కేసులో ఏపీ హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది. ఈ కేసులో రెండు వారాల పాటు తదనంతర చర్యలు తీసుకోవద్దని పోలీసులకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ జగన్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. తమ వద్ద ఉన్న వీడియో ఆధారాలు, ఇతర సాక్ష్యాలు కోర్ట్ ముందు ఉంచేందుకు రెండు వారాలు సమయం కావాలని కోర్టును అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. అయితే ఇప్పటికే ఈ కేసును బీఎన్ఎస్ కింద 105 సెక్షన్‌కు మార్చారని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. అందువల్ల తదనంతర చర్యలు, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోర్టును జగన్ తరఫు న్యాయవాదులు కోరారు. దీంతో రెండు వారాల పాటు తదనంతర చర్యలపై హైకోర్టు స్టే విధించింది. కాగా, ఇటీవల మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా సింగయ్య అనే వృద్ధుడు మృతిచెందాడు. జగన్ ప్రయాణిస్తున్న కారు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. తొలుత జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని వృద్ధుడు చనిపోయాడని వార్తలు వచ్చినప్పటికీ నాలుగు రోజుల తర్వాత జగన్ కారు కిందే సింగయ్య పడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో జగన్ సహా పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో హైకోర్టును జగన్ ఆశ్రయించారు. తమపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది.

## నం.1 రాష్ట్రంగా ఏపీ

ఎన్నిక నిర్వాహకుడు, ఎంపీ పాకా సత్యనారాయణ ధ్రువీకరణ పత్రం అందజేయగా.. పురందేశ్వరి పార్టీ జెండా మాధవ్ చేతికి అందజేసి బాధ్యతలు బదిలీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన సంఘటనా పర్వ్‌లో మాధవ్ మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్ష పదవి తనకు బాధ్యత అని, ఒక చేత్తో బీజేపీ జెండా, మరో చేత్తో ఎన్డీఏ అజెండాతో పనిచేస్తానని తెలిపారు. "రాష్ట్రంపై అభిమానం, భాషపై మమకారం ఏర్పరచుకొని జాతీయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరం ముందడుగు వేయాల్సిన బాధ్యత ఉంది. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో భాషతో పాటు రాజధాని కూడా అన్యాయానికి గురైంది. అమరావతి రాజధానిగా ఏడాదిగా సుపరిపాలన జరుగుతోంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశాఖలో యోగాంధ్ర నిర్వహించి ప్రపంచం ఆరోగ్యంగా ఉండేలా ప్రయత్నం చేశారు. ఒకప్పుడు ఒడిసా, కర్ణాటకతో పోల్చితే ఏపీలోనే బీజేపీ బలంగా ఉండేదనే విషయాన్ని ప్రధాని విశాఖ పర్యటన సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో పార్టీని బలమైన శక్తిగా కార్యకర్తలు గర్వపడే స్థాయికి చేరుస్తాను. ఎమర్జెన్సీ గాయానికి యాభై ఏళ్లు వచ్చేనాటికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అయ్యాను. ఇదే సమయంలో ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు కావడం ఆనందంగా ఉంది." అని మాధవ్ అన్నారు.

**మాధవ్‌కు సీఎం శుభాకాంక్షలు**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు సీఎం చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో రాణించాలని ఆకాంక్షించారు. కూటమి పార్టీల సమన్వయం, పరస్పర సహకారంతో రాష్ట్రాభివృద్ధికి పాటు పడుదామని సూచించారు. మంత్రి లోకేశ్ కూడా మాధవ్‌కు అభినందనలు తెలియజేశారు.

## ప్రజల ఆయుష్షు 85 ఏళ్లకు పెరగాలి
### మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రణాళికలు
### వైద్యులపై దాడులు సరికాదు:మంత్రి సత్యకుమార్




అమరావతి, జూలై 1 రాష్ట్ర ప్రజల సగటు ఆయుష్షును ప్రస్తుతం ఉన్న 71ఏళ్ల నుంచి 85ఏళ్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ప్రసవకాల మాతృ మరణాలను 45 నుంచి ఐదుకు, శిశు మరణాలను 24 నుంచి రెండుకు తగ్గించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, ప్రజల ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం శ్రమించే వైద్యులను అందరూ గౌరవించాలని కోరారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని, ఈ దిశగా ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేస్తున్న వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఆఖరి క్షణం వరకు శ్రమించే వైద్యులపై దాడులు, జులుం చేయడం సరికాదన్నారు. చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందని భావిస్తే ప్రభుత్వం, ఆస్పత్రి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సిబ్బం ది పనితీరుపై నిఘా పెంచామని, ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో గాడితప్పిన ప్రజారోగ్య రంగాన్ని కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో తిరిగి పట్టాలెక్కించిందని వివరించారు. 'జాతీయ వైద్యుల దినోత్సవం' సందర్భంగా వివిధ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన పది మంది వైద్యులను మంత్రి సత్కరించారు. ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ పద్మశ్రీవాత్సవ, డీఎంఈ, ప్రముఖ శస్త్రచికిత్స వైద్య నిపుణుడు డాక్టర్ నరసింహంకు ఉత్తమ వైద్యులుగా అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీ చైర్మన్ శ్రీహరిరావు, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధిక రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## మరోమారు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర



**(మొదటి పేజీ తరువాయి)**
ఈ పాదయాత్రకు వచ్చిన రెస్పాన్స్ అప్పట్లో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు మళ్ళీ అదే సీన్ రిపీట్ కానుందని తెలుస్తోంది. 2029 ఎన్నికలకు ముందు మరోసారి పాదయాత్ర చేస్తానని ప్రకటించారు జగన్. మంగళవారం తాడేపల్లిలో వైసీపీ యూత్ వింగ్ తో భేటీ అయినా జగన్ ఈమేరకు సంచలన నిర్ణయం ప్రకటించారు. యూత్ వింగ్ పార్టీలో క్రియాశీలకమైందని.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర అని అన్నారు జగన్. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని.. లీడర్లుగా ఎదిగేందుకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే గొప్ప అవకాశం ఉంటుందని అన్నారు జగన్. వచ్చే ఎన్నికలకు ముందు ఎలాగో తన పాదయాత్ర ఉంటుందని.. అప్పుడు సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రతి ఒక్కరిని పేరుపేరునా పిలిచి కలుస్తానని అన్నారు జగన్. పార్టీ పెట్టిన కొత్తలో అందరూ కొత్తవాళ్లే అని.. అప్పట్లో పార్టీలో తాను, తన తల్లి మాత్రమే ఉన్నారని, తన మీద వ్యక్తిగతంగా అభిమానం ఉన్నవాళ్లు పార్టీలోకి వచ్చారని జగన్ అన్నారు. పార్టీ పెట్టడంతోనే తన ప్రస్థానం మొదలైందని.. ఎన్ని కష్టాలు వచ్చినా.. విలువలు, విశ్వసనీయతకే పెద్దపీట వేశానని అన్నారు. రాజకీయంగా ఇబ్బందులు వచ్చినా రాజీ పడలేదని.. ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీ తనకు వచ్చిందని అన్నారు. పార్లమెంటులో ప్రతి సభ్యుడూ తనవైపు చూసే పరిస్థితి ఉండేదని.. దాన్ని జీర్ణించుకోలేక తనమీద పగబట్టారని అన్నారు జగన్. 18 మంది ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తే వాళ్లందరిచేతా రాజీనామా చేయించానని.. ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించామని అన్నారు. ఆ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ కాంగ్రెస్ కలిసి పోటీచేశాయని గుర్తు చేశారు. 2014లో 67 మందితో గెలిచామని.. గెలిచిన 67 మందిలో 23 మందిని చంద్రబాబు లాక్కున్నారని అన్నారు. దేవుడి స్క్రిప్ట్ ప్రకారం 2019 ఎన్నికల్లో వాళ్ళు లాక్కున్న 23 సీట్లకే పరిమితమయ్యారని అన్నారు జగన్. ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా ముఖ్యమని.. ప్రజలకు సమస్య వచ్చినప్పుడు ప్రజలకు తోడుగా నిలబడాలని.. మంచి పలకరింపు అన్నదికూడా చాలా ముఖ్యమని.. ఇవి చేయగలిగితే.. లీడర్‌గా ఎదుగుతారని అన్నారు జగన్. మళ్ళీ పాదయాత్ర ఉంటుందని వైఎస్ జగన్ ప్రకటించడంతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఈసారి వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. జగన్ 2.0 లోడింగ్ అంటూ కామెంట్ చేస్తున్నారు వైసీపీ శ్రేణులు.

## కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..

**హైదరాబాద్, జూలై 1 ఆంధ్రప్రగతి :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు 2015లో చేసిన సంతకాలే తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనంగా మారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర జలాల విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదని, తెలంగాణ హక్కుల సాధన కోసం రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల' అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పదేళ్ల పాటు నీటిపారుదల శాఖను కేసీఆర్, హరీశ్ రావులే చూశారు. వారే రాష్ట్ర నీటి హక్కులను కాపాడతారని ప్రజలంతా భావించారు. కానీ దురదృష్టవశాత్తు వారి నిర్ణయాల వల్లే తెలంగాణకు తీరని నష్టం జరిగింది" అని ఆయన అన్నారు.కృష్ణా జలాల్లో మొత్తం 811 టీఎంసీలకు గాను తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని, మిగిలిన 68 శాతం నీటిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 2015లో వారే సంతకాలు చేశారని రేవంత్ ఆరోపించారు.కృష్ణా నది పరివాహక ప్రాంతం ప్రకారం చూస్తే వాస్తవానికి తెలంగాణకే ఎక్కువ నీటి వాటా దక్కాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ప్రాజెక్టులను గత పదేళ్లలో పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్రానికి కేటాయించిన 299 టీఎంసీల నీటిని కూడా పూర్తిగా వాడుకోలేని దయనీయ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తమ ప్రాజెక్టులను పూర్తిచేసుకొని నీటిని తరలించుకుపోతోందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, నీటి హక్కుల పరిరక్షణలో వెనకడుగు వేసేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

## వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత
### సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మిక మరణం
### ప్రముఖ ఇంద్రజాలికుడిగా, సైకాలజిస్టుగా గుర్తింపు



**హైదరాబాద్, జూలై 1ఆంధ్ర ప్రగతి :** పముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తన మాటలతో లక్షలాది మందిలో స్ఫూర్తి నింపిన పట్టాభిరామ్ ఆకస్మిక మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది.బీవీ పట్టాభిరామ్ కేవలం వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా, పేరుగాంచిన ఇంద్రజాలికుడిగా, మానసిక నిపుణుడిగా కూడా తెలుగు ప్రజలకు సుపరిచితులు. అనేక పుస్తకాలు, టెలివిజన్ కార్యక్రమాలు, వేలాది ప్రసంగాల ద్వారా ఆయన సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు విశేష కృషి చేశారు. క్లిష్టమైన మానసిక శాస్త్ర అంశాలను సైతం సామాన్యులకు అర్థమయ్యేలా సులభమైన శైలిలో వివరించడం ఆయన ప్రత్యేకత.

## ఎందరో కార్యకర్తల త్యాగం వల్లే ఈ స్థాయికి...

**హైదరాబాద్, జూలై 1ఆంధ్ర ప్రగతి :**

ఎంతో మంది కార్యకర్తల త్యాగాల ఫలితంతోనే బీజేపీ ఈ స్థాయికి చేరుకుందని బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం గర్వంగా భావిస్తున్నాను.. ప్రతి కార్యకర్త గర్వించాలి.. అందరం కలిసికట్టుగా పని చేద్దాం అని పిలుపునిచ్చారు. తాను పేరుకే అధ్యక్షుడిని.. నేనెప్పటికీ కార్యకర్తనే.. మీ సేవకుడినే పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కిషన్ రెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే ఈ పార్టీకి నిజమైన సారథులు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జనసంఘ్ అభ్యర్థి పోటీ చేస్తే వెయ్యి ఓట్లు మాత్రమే వచ్చాయి.. కమ్యూనిస్టుపార్టీ గెలిచింది.. ఆనాడు జనసంఘ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు టపాసులు కాల్చారు.. ఇదేందని కమ్యూనిస్టులు అడిగితే గత ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని సంబురాలు చేసుకుంటున్నామని చెప్పారు.. ఇవాళ అదే ఉత్సాహంతో తెలంగాణలో 8 ఎమ్మెల్యే, 8 ఎంపీ, 3 ఎమ్మెల్సీ సీట్లను కైవసం చేసుకున్నామని రామచందర్ రావు తెలిపారు. అయితే, పార్టీ కోసం సైకిల్ పై రాష్ట్రమంతటా తిరుగుతూ ఎంతో కష్టపడ్డామని టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు పేర్కొన్నారు. బీజేపీ ఈ స్థాయికి వచ్చిందంటే.. ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు త్యాగాలున్నాయి.. మీ చెమట కష్టంతోనే బీజేపీ ఎదిగింది.. అందరి ఆశీస్సులతో నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వంగా ఉంది.. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాల వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగింది.. బీజేపీ మాస్ క్యాడర్ పార్టీ, సిద్ధాంత బలమున్న పార్టీ.. కలిసికట్టుగా గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేద్దామని తెలిపారు. బీజేపీలో కొత్త, పాత అనే పంచాయతీ లేదు.. నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందే అన్నారు. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాల్సిందే అని రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఇక, యువకులారా.. మహిళలారా.. బీజేపీలోకి రండి అంటూ రామచందర్ రావు పిలుపునిచ్చారు. 33 శాతం రిజర్వేషన్ల అమలుతో మహిళలకు ఎన్నో అవకాశాలు రాబోతున్నాయి.. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పని చేస్తాను.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ యూనివర్శిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్ ను ట్రోలింగ్ చేస్తున్నారు.. స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు తెచ్చుకుని పోరాడుదాం.. మీకు దమ్మంటే.. నేరుగా ఎదురుగా పోరాడదాం.. నేను క్రిమినల్ లాయర్ ను.. ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని తేల్చి చెప్పారు. రామచంద్రరావు సౌమ్యుడినే.. యుద్ధంలోకి దిగితే యోధుడినే.. కత్తి దూయడంలో ముందుంటానని చెప్పుకొచ్చారు. ఇక, తెలంగాణ ప్రజల తరపున అలుపెరుగని పోరాటం చేస్తానని తెలంగాణ కమలం పార్టీ అధినేత తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ తదితరులు నాయకత్వంలో వారి సహకారంతో ముందుకెళ్తామన్నారు. 14 కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా ఉంది. అలాంటి రాజకీయ పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడినయ్యా. తెలంగాణ అధ్యక్షుడిగా నన్ను ప్రకటించడం గర్వంగా భావిస్తున్నా. కార్యకర్తగానే పనిచేస్తా. పార్టీలో నాయకులంతా సమష్టిగా పనిచేస్తారు. కొత్తపాత తేడా లేదు.. ఎవరైనా భాజపాలో చేరినప్పటి నుంచే పార్టీ వ్యక్తులు. కొత్తనీరు రావాలి. యువత, మహిళలు భాజపాలో చేరాలి. పార్టీని బలపరచాలి. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి. కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీ నడుపుతోంది. భాజపా నేతలను ట్రోల్ చేస్తున్నారు. రామచందర్‌రావు సౌమ్యుడు కాదు. 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చా. విద్యార్థుల కోసం పోరాడి పోలీసుల దెబ్బలు తిన్నాను. ప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటం చేస్తాను. తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. ప్రజలు, కార్యకర్తలు, నేతలు కలిసి రావాలి' అని రామచందర్‌రావు అన్నారు. కార్యక్రమంలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్, ఈటెల, డికె అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉపాధి హామీ ప్రగతి లక్ష్యాలను అధిగమించాలి.

**ప్రతి కుటుంబానికి వందరోజుల రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలి.**

**జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 01:** జిల్లాలో ఉపాధి హామీ ప్రగతిలో లక్ష్యాలను వందశాతం అధిగమించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనులను పటిష్ఠంగా అమలు చేసి లక్ష్యాలలో వందశాతం ప్రగతి సాధించాలని సూచించారు. లేబర్ మొబిలైజేషన్ లో భాగంగా ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఇందులో భాగంగా పండ్ల తోటల పెంపకం, లేబర్ టార్గెట్, సరాసరి దినసరి వేతనం, ఫారం పాండ్స్, సోక్ పిట్స్, నాడేప్ కంపోస్ట్ పిట్, కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాలలో మండలాల వారీగా ప్రగతిపై సమీక్షించారు. వెనుకబడిన మండలాల అధికారులతో కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగతిలో వెనుకబడిన మండలాలు ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎం అండ్ ఇ భాస్కర్ నాయుడు, ఏపీడీలు నరసింహారెడ్డి, సాంబశివరావు, అన్వరా బేగం, కోర్సు డైరెక్టర్లు ఏసుదాస్, పరమేశ్వరుడు, ఇస్మాయిల్, ఏపిఓలు, ఇసిలు, ప్లాంటేషన్ సూపర్వైజర్లు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వర్కర్స్ దీక్షలకు సంఘీభావం తెలిపిన ఏపిజెయు.

**7వ రోజుకు చేరుకున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ దీక్షలు.**

**నంద్యాల మున్సిపల్ వర్కర్స్ కు ఎపిజెయు ఎప్పుడు అండగా ఉంటుంది. -ఎపిజెయు జిల్లా కమిటీ నాయకులు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 01:** నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గత వారం రోజులుగా నెలసరి జీతత్యాలు, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధంతో నిరాహారా దీక్షలను చేపట్టారు. 7వరోజు మున్సిపల్ కార్మికులు చేస్తున్న దీక్షలకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపిజెయు) ఆధ్వర్యంలో మంగళవారం నంద్యాల జిల్లా యూనియన్ నాయకులు సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిఎం నాగేంద్ర లు మాట్లాడుతూ, నంద్యాల మున్సిపల్ కార్మికులు సియటియు అనుబందంతో గత రెండు నెలలుగా నెలసరి జీతాలు, కార్మికుల సమస్యల పై ధర్నాలు చేస్తున్నారని,వారిని మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించు కోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల మున్సిపల్ కార్మికులు ఎనలేని సేవలను
నంద్యాల ప్రజలకు అందిస్తున్నారని, వారు కోరుతున్న కోర్కెలు న్యాయం ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం లో ఐదు సంవత్సరాలు చాలి,చాలని జీవహింసను అనుభవించారని అన్నారు. మున్సిపల్ కార్మికులు కన్నెర్ర చేస్తే త్రాగడానికి మంచినీళ్లు, రాత్రిళ్ళు విధ్యుత్ సరఫరా నిలిచిపోయి, ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతారని తెలిపారు. కాబట్టి స్థానిక మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మున్సిపల్ కార్మికుల సమస్యల పై స్పందించి, వారికి అండగా నిలిచి ప్రభుత్వం ద్వారా న్యాయం చేయాలని కోరారు. నంద్యాల మున్సిపల్ కార్మికులకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ ఎల్లప్పుడూ అండగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ మరియు ఎంప్లాయ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి భాస్కర ఆచారి, ఉపాధ్యక్షులు రంగనాథ్, సహాయ కార్యదర్శి బాల దుర్గన్న, ఏపిజెయు జిల్లా నాయకులు నరసింహ మూర్తి, నాగేశ్వర రెడ్డి,ఎన్. సి శ్రీనివాసులు,అబ్దుల్ మజీద్, షేక్ మౌలాలి, ప్రేమ్ కుమార్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల వైద్యుల సేవలు అభినందనీయం.!

**రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్.**

**తిరుమల పునీత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన మంత్రి ఫరూక్.**

**ఐ ఎం ఏ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయిస్తాం.**













**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ జూలై 01:** జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని జులై 1 వ తేదీన తిరుమల పునీత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్, చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ హరితల నిర్వహణలో డాక్టర్ అనిల్ కుమార్ తండ్రి దివంగత డాక్టర్ సత్యనారాయణ జ్ఞాపకార్థం రెండు రోజుల ఉచిత వైద్య శిబిరం మంగళవారం రాష్ట్ర న్యాయ,మైనారిటీ శాఖల మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. దివంగత వైద్యులు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో అనేక వైద్య శిబిరాలు,ప్రజా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని అభినందించారు. వైద్య సదస్సులు, ప్రజా ఆరోగ్య అవగాహన సభలు, వైద్య శిబిరాల నిర్వహణ కోసం నంద్యాల ఐఎంఏ భవనాన్ని నిర్మిస్తామని అభ్యర్థించడంతో వారికి ప్రభుత్వ స్థలం కేటాయించడానికి ప్రతిపాదిస్తున్నామన్నారు. డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ హరిత ప్రతి సంవత్సరం వైద్యుల దినోత్సవం రోజు వారి తండ్రి జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పేదలకు సేవలు అందించడం ప్రశంసనీయమని అన్నారు. నంద్యాలలో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలు అందుబాటులోకి రావడంతో నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గిపోయిందన్నారు. వైద్యులు ప్రజలకు మానవతా దృక్పథంతో సేవలు అందించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నంద్యాలలో డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ అనిల్ కుమార్ ఇంకా అనేకమంది వైద్యులు వైద్య వృత్తికే పరిమితం కాకుండా, దివ్యాంగుల సేవలు, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో కూడా క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు.
ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గత నాలుగు దశాబ్దాలుగా నంద్యాల అభివృద్ధిలో కీలక పాత్ర వహించారని, ప్రస్తుతం మంత్రిగా నంద్యాల అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్నారని,ప్రభుత్వ కార్యక్రమాలకు వైద్యుల సహకారం కొనసాగిస్తామన్నారు.
నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, రోటరీ మాజీ గవర్నర్లు కల్లూరి రామలింగారెడ్డి, కందుకూరి శ్రీరామ్మూర్తి, చిన్నపరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు వివేకానంద రెడ్డి, కార్యదర్శి బాలకృష్ణ సమావేశంలో ప్రసంగించారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ ను డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ హరిత దంపతులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మంత్రి డాక్టర్ మధు సూదనరావు, డాక్టర్ నర్మద, డాక్టర్ కల్పనలకు వైద్య దినోత్సవ పురస్కారాలు అందించి సత్కరించారు.
ఈ కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ వసుధ, పలువురు వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు శిబిరంలో చికిత్స పొందడానికి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 500 మంది రోగులను చూసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి దాదాపు లక్ష రూపాయల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.
శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి తేదీలు కేటాయించి ఉచితంగా చేయడం జరుగుతుందని డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు.

# కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలి.

**తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అందరూ భాగస్వామ్యులు కావాలి.**

**టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01: నంద్యాల లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సుపరిపాలన లో తొలి అడుగు సన్నాహక సమావేశానికి నంద్యాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.
ఈ సందర్భంగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అయిదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం అన్నివిధాలుగా నష్ట పోయిందని. రాష్ట్రాన్ని అప్పులు మయం చేసి, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ఈ ఏడాది కాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకున్న అపారమైన అనుభవంతో, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో నిర్వీర్యం అయిన వ్యవస్థలను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపారన్నారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, మరో వైపు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, రాజధాని అమరావతి ని పునః నిర్మాణం చేయడంతో పాటు, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు . జులై 2 వ తేదీ (రేపటి) నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమములో నంద్యాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు అందరూ భాగస్వామ్యులు అయ్యి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో భాగంగా ఇంటింటికీ వెళ్లి, గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకొని, వాటిని నా దృష్టికి తీసుకొని వచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా గత ఏడాదిగా నంద్యాల శాసనసభ్యులు, మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి మరియు సేవా కార్యక్రమాలు ను కూడా ఇంటింటికీ వెళ్లినప్పుడు వారికి వివరించాలని కోరారు.
ఈ సమావేశంలో ఓటర్ వెరిఫికేషన్ నంద్యాల పార్లమెంటు కోఆర్డినేటర్ మధు సుధాకర్ , తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మెట్ల భాస్కర్ రెడ్డి , నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి , పట్టణ అధ్యక్షుడు ఖలీల్ , మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్ యాదవ్, నియోజకవర్గ నలుమూలల నుండి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకులకు ఆగమ విద్యున్ మణి బిరుదు.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూలై 01:** ఆళ్లగడ్డ మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవస్థానంలో ప్రధానార్చకులుగా విధులు నిర్వహిస్తున్న కీడాంబి వేణుగోపాల్ స్వామికి అత్యంత అరుదైన పురస్కారం లభించింది. తమిళనాడులోని శ్రీరంగం క్షేత్రంలో అహోబిల మఠం 46 వ పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహదేశిఖన్ స్వామి వారి 70 వ జయంతి.. మరియు భీమరథ శాంతి సందర్భంగా 2 వేల మంది వేద పండితులతో పది రోజులు పాటు నిర్వహించిన వేద విద్వాంసుల సభలో అత్యంత ప్రతిభ కనబరిచిన అహోబిలం ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి చూపిన ప్రతిభకు ఆగమ విద్యున్ మణి బిరుదును, ప్రశంశ పత్రం , బంగారు డాలర్, నగదు అవార్డులను ఆయనకు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు వేణుగోపాలస్వామి మీడియాతో మాట్లాడుతూ పీఠాధిపతి వారి జయంతి ఉత్సవాలలో తనకు గుర్తింపు లభించడం ఎంత గర్వకారణంగా ఉందని ఆయన తెలిపారు. శ్రీ స్వామి వారు 72 మంది వేద విద్వాంసులకు అవార్డులో ఇచ్చి సత్కరించారని అందులో తాను ఒకరిని ఆయన తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రాయలసీమ ప్రాజెక్టులకు తక్షణమే నీటిని విడుదల చేయాలి.

**తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలకు నీటి విడుదల.శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయాలి.**

**కర్నూలు జలవనరుల శాఖ కార్యాలయం దగ్గర బుధవారం ధర్నా నిర్వహించనున్న రాయలసీమ రైతు, అఖిలపక్ష పార్టీల నాయకులు.**

**-బొజ్జా దశరథరామిరెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 01:**
తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలకు నీటి విడుదల చేయకుండా తుంగభద్ర డ్యాం నుండి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారనీ...జూన్ 22 నాటికే శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 854 అడుగులకు చేరినా రాయలసీమ ప్రాజెక్టులకు నీటి విడుదల చేయని ప్రభుత్వం తీరుపై రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు.
మంగళవారం నంద్యాల సమితి కార్యాలయంలో బొజ్జా మాట్లాడుతూ..సాధారణంగా రావలసిన రుతుపవనాల కంటే సుమారు 15 రోజులు ముందుగా రాయలసీమలో రుతుపవనాలు ప్రవేశించడంతో గత మే నెలలో వర్షాలు రాయలసీమలో విస్తారంగా కురవడంతో రైతులలో ఆశలు చిగురించి కేసీ కెనాల్, తెలుగు గంగ, ఎస్ ఆర్ బి సి , ఎల్ఎల్సి ఆయకట్టు కింద లక్ష ఎకరాలకు పైగా పొలాలలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, కంది , వేరుశనగ తదితర ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారనీ...అయితే వాతావరణ శాఖ అంచనాలకు విరుద్ధంగా రుతుపవనాల గమనం మందగించడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ పంటలను కాపాడుకోవడానికి శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ప్రాజెక్టులకు తక్షణమే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం అత్యంత శోచనీయమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 869.73 అడుగులు చేరినా రాయలసీమ ప్రాజెక్టులకు నీటి విడుదలకు ముందుకు రాని ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో రిజర్వాయర్ నుంచి దిగువకు నీటి విడుదల చేయడం పట్ల రాయలసీమ పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని ఘాటుగా విమర్శించారు.
దుర్భిక్ష వాతావరణం నేపథ్యంలో ఎండిపోతున్న పంటలను కాపాడటానికి, శ్రీశైలం రిజర్వాయర్ మరియు తుంగభద్ర డ్యామ్ నుండి రాయలసీమలోని వివిధ రిజర్వాయర్లకు, ప్రాజెక్టులకు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేసారు.
నీటి విడుదలలో రాయలసీమ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా 2-06-2026 బుధవారం నాడు రాయలసీమ ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీల నాయకుల ఆద్వర్యంలో కర్నూలు జలవనరుల శాఖ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని బొజ్జా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు పాల్గొని రాయలసీమ రైతాంగానికి బాసటగా నిలబడాలని బొజ్జా విజ్ఞప్తి చేసారు.

## ఎల్ఐసి కార్యాలయంలో ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 01:**
నంద్యాల ఎల్ఐసి కార్యాలయంలో మంగళవారం ఎఐఐఇఎ (ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్) 75 వ ఆవిర్భావ దినోత్సవం ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు హరిప్రియ యూనియన్ జండాను ఆవిష్కరించారు. సంఘం నాయకుడు ఏ రమేష్ బాబు మాట్లాడుతూఏఐటిఏ పి గత ఏడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో సంస్థ ప్రగతి ఉద్యోగుల భవిష్యత్తు కోసం విశేష కృషి చేసిందన్నారు.ఎల్ఐసీ ఆవిర్భావంతోపాటు దేశవ్యాప్తంగా అది పటిష్ట పడాలని భారత ఆర్థిక వ్యవస్థకు ఒక చోదక శక్తిలా ఏర్పడాలని నిరంతరం ఉద్యోగులను పురమాయిస్తూ వచ్చింది. అడ్మినిస్ట్రేటివ్ పనికి మాత్రమే సంబంధించిన ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ నూతన వ్యాపార సేకరణలో నిమగ్నమై ఉండే ఫీల్డ్ ఫోర్స్, ఏజెంట్లను అనేక సందర్భాల్లో కదిలిస్తూ, సర్వీసింగ్ ఫోర్ట్ నైట్లను, నూతన వ్యాపార సేకరణకు కార్యక్రమాలను పిలుపునిచ్చింది. మెగా బిజినెస్ డే అను పేరు పైన నూతన వ్యాపారంలో దేశవ్యాప్త రికార్డు నెలకొల్పడానికి మేనేజ్మెంట్తో కలిసి తనవంతు కృషిచేసి ఎల్ఐసి ఇండియా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ భువనేంద్ర, కోశాధికారి, పిసి రామకృష్ణుడు, వెంకట రాముడు, శేషగిరి రావు, శాకీర్ , పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో డాక్టర్స్ డే వేడుకలు.

**వీసీని సన్మానించిన లయన్స్ క్లబ్ మాజీ రాష్ట్ర మల్టిపుల్ చైర్మన్లు ఏ వి ఆర్ ప్రసాద్, శ్రీనివాస్.**




**ఆంధ్ర ప్రగతి విజయవాడ జులై 01:** కనిపించే ప్రత్యక్ష దైవాలు వైద్యులని, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని రాష్ట్ర లయన్స్ క్లబ్ ల సమాఖ్య మాజీ మల్టిపుల్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్ అన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ వైద్య విద్య విశ్వవిద్యాలయంలో డాక్టర్స్ డే వేడుకలు వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్స్ డే సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ ను ఏవిఆర్ ప్రసాద్, మరో మల్టిపుల్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు ఘనంగా సన్మానించారు.

## పారా ఒలంపియన్ అర్షద్ షేక్ ను అభినందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతినంద్యాల జులై 01:**
జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడా పోటీలలో పతకాలు సాధించిన నంద్యాల వాసి పారా ఒలంపియన్ అర్షద్ షేక్ ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అభినందించారు.
మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు డిఎస్డివో ఆధ్వర్యంలో పారా ఒలంపియన్ అర్షద్ షేక్ జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణానికి చెందిన అర్షద్ షేక్.. జాతీయస్థాయిలో బాడీ బిల్డింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, ట్రైతలాన్, వీల్ చైర్ ఫెన్సింగ్ తదితరాలలో పాల్గొని పథకాలు సాధించారని కలెక్టర్ కు వివరించారు. అలాగే 2020లో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఒంటి కాలితో సైకిల్ తొక్కడం జరిగింది. దాదాపు 60 సంవత్సరాల తర్వాత దేశం తరపున అంతర్జాతీయంగా 2024లో పారిస్ లో జరిగిన పారా ఒలంపిక్స్ నందు పారాసైక్లింగ్లో పాల్గొన్నారు. ఈ ఏడాది జాతీయస్థాయిలో హైదరాబాదులో నిర్వహించిన పారాసైక్లింగ్ లో పాల్గొని గెలిచి జాతీయ ఛాంపియన్ గా పతకం సాధించారు. ఇప్పటివరకు దాదాపు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 15 మెడల్స్ సాధించారని, దేశంలో మొదటి స్థానం, ఏషియాలో రెండవ స్థానం, ప్రపంచంలో ఐదవ స్థానం ర్యాంకు లో ఉన్నట్లు పేర్కొన్నారు. అర్షద్ షేక్ జిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది క్రీడలలో రాణించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, డిఎస్డివో రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేసిన మంత్రి ఫరూక్.












ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 01:
నంద్యాల టౌన్ 36 వ వార్డులో లబ్ధిదారుకు స్వయంగా పింఛన్ అందజేసిన రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.ఈ సందర్భంగా 36 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి ప్రసాద్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో .. రామకృష్ణ స్కూల్ వీధిలోని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేసిన రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్,ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందని అన్నారు . 200 రూపాయలు ఉన్న పెన్షన్ వేయి రూపాయలు చేసిన ఘనత చంద్రబాబు కే దక్కిందని అన్నారు. అదేవిధంగా 1000/- రూపాయలు ఉన్న పెన్షన్ 2000/- చేసిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారని అన్నారు గత ప్రభుత్వంలో 2000 ఉన్న పెన్షన్ ని 3000 పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని ఏట 250/-రు పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారన్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం 3000/- రు పెన్షన్ ని 4000 పెంచుతూ అదేవిధంగా మూడు నెలల ముందే ప్రతి నెల 1000 రూపాయలు చొప్పున మొత్తం కలిపి 7000 రూపాయలు అధికారం చేపట్టిన మొదటి నెలలోనే పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అలా ప్రతినెల 1వ తేదీనే పింఛన్ ఇవ్వడం జరుగుతుందని అలాగే ఒకటవ తేదీ ఆదివారం వస్తే 31వ తేదీనే వారికి పింఛన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు . రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా 1 జులై 01వతేదీ న నంద్యాల రామకృష్ణ స్కూల్ వీధిలో పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే నంద్యాలలో అన్ని వార్డులలో, అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు దగ్గరుండి లబ్ధిదారులకు పింఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులకు, టిడిపి నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ప్రజలకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసు , టిడిపి నాయకులు ఉదయ్ కుమార్ శేఖర్ రెడ్డి నగరడం , సుధీర్ చంటి , పుల్లయ్య , సురేష్ బాబు , దాసు, రూబిన్ సచివాలయం అడ్మిన్ శర్మ మరియు టిడిపి మహిళా నాయకురాలు దుండగుల వెంకటలక్ష్మి , మేరీ, కళ్యాణి, మాధవి సచివాలయం సిబ్బంది టిడిపి నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 01:**
పీఎం సూర్య ఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని.. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త్ బిజిలి యోజన పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు వందమంది దరఖాస్తుదారులకు స్టేట్ బ్యాంకు వారు మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం లబ్ధిదారులతో కలిసి ఎస్బిఐ అధికారులు స్థానిక కలెక్టరేట్లోని ఛాంబర్ లో కలెక్టర్ రాజకుమారి గణియాను కలిశారు. ఇందుకు సంబంధించిన బ్యాంకు మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు.. నంద్యాల మండలం పాండురంగాపురం, డోన్ మండలం గోసానిపల్లి రెండు గ్రామాలను సౌర విద్యుత్ గ్రామాలుగా చేయడానికి ఎస్బిఐ వారు రుణాలను మంజూరు చేసిన విషయాన్ని కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులను, లబ్ధిదారులను కలెక్టర్ అభినందించారు. ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఆర్ఎం వెంకట సూర్య ప్రకాష్, బ్రాంచ్ మేనేజర్ శేషు, ఎల్డిఎం రవీంద్ర కుమార్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం2 జులై 2025

# నేర నియంత్రనే లక్ష్యంగా అందరూ పని చేయాలి.

**జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా.**

**కేసుల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించాలి. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీని పటిష్ట చేయాలి.**

**మహిళలు/చిన్నారులపై జరిగే నేరాల నివారణకు ప్రతిష్ట చర్యలు తీసుకోవాలి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూలై 01:**
నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రనే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అధికారులను ఆదేశించారు.ఈ సంధర్భంగా జిల్లాలోని నంద్యాల ,ఆళ్లగడ్డ ,ఆత్మకూరు, డోన్ డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో మాట్లాడుతూ వారి వారి పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్పీ సమీక్షించి ఆరా తీశారు.కేసుల పెండింగ్ కు గల కారణాలను, కేసుల దర్యాప్తులో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. నేర నియంత్రణలో కేసుల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ లో నమోదయ్యే ప్రతి కేసు వివరాలను క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని అన్ని వివరాలు నమోదు చేయడం వలన కేసుల పూర్తి సమాచారం తెలుస్తుందని అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందన్నారు. గ్రేవ్ కేసులు, యు ఐ కేసులు, పిటి కేసులు, మర్డర్, సైబర్ క్రైమ్, ఫోక్సో, మిస్సింగ్ కేసులు ,ఎస్సీ ఎస్టీ కేసులపై ఆరా తీస్తూ వాటి దర్యాప్తు పురోగతిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని,ప్రాధాన్యత గల కేసులలో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీలు పటిష్టం చేయాలని, రాత్రి వేళలో అనుమానాస్పదంగా అనవసరంగా బయట సంచరించే వారిపై మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా వేలి ముద్రలను సేకరించి, వాటిని నేర రికార్డులతో సరిపోల్చి నేరగాళ్ళను పట్టుకోవాలన్నారు.ఎ న్ఫోర్స్మెంట్ పై ప్రత్యేక దృష్టి ఉంచాలని ప్రతిరోజు విజిబుల్ పోలీసులలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, అక్రమ మద్యం, పిడిఎస్ రైస్ మొదలగునవి అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్ ,మైనర్ డ్రైవింగ్ లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో,రోడ్డు మలుపులలో రేడియం స్టిక్కర్స్, బారికేడ్స్, జిగ్ జాగ్ డ్రమ్స్ , స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు మలుపుల వద్ద అడ్డుగా ఉన్న ముళ్లపదలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మిస్సింగ్ కేసులు, పోక్సో, మహిళల పై జరిగే నేరాల నివారణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇటువంటి కేసుల గురించి సిబ్బందికి బ్రీఫింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద జావళి ఆల్ఫోన్స్ ,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏన్.యుగంధర్ బాబు, సాయుధ బలగాల అదనపు ఎస్పి జి. చంద్రబాబు, ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ కుమార్, ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్, జిల్లాలోని ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు నేషనల్ స్కూల్ అవార్డ్ - 2025.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 01:**
ప్రముఖ విద్యా సంస్థ నెరవా టి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు "ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్ 2025" ని నేషనల్ స్కూల్ అవార్డ్స్ ప్రతినిధులచే ప్రదానం చేయడం జరిగింది. ఇది విద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూ, విద్యార్థుల అఖండాభివృద్ధికి కృషి చేస్తున్న నెరవాటి పాఠశాల విజయం పట్ల గౌరవ సూచక గుర్తింపుగా నిలిచింది.ఈ గౌరవాన్ని పొందడంలో ప్రధాన పాత్ర వహించిన మా చైర్మన్ శ్రీ ఎన్. ఆనంద్ గుప్త దూరదృష్టి, మార్గదర్శనం మరియు విద్య పట్ల ఉన్న నిబద్ధత ప్రశంసనీయమైనది. అలాగే డైరెక్టర్ శ్రీ నెరవాటి రోహిత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యా విధానం ఆధునిక సాంకేతికతతో మేళవించి, నూతనతకు నాంది పలికింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రిన్సిపాల్ మోమీన్ ఫరాయతుల్లా మాట్లాడుతూ %-% "ఈ అవార్డు మా బోధన సిబ్బంది యొక్క నిస్వార్థ శ్రమ, మరియు విద్యార్థుల యొక్క పట్టుదలకు ఫలితంగా సాధ్యమైంది. ఈ గౌరవం మా పాఠశాల స్థాయిని మరింతగా పెంచడమే కాకుండా, భవిష్యత్‌లో ఇంకా ఎన్నో విజయాలను సాధించేందుకు ప్రేరణనిస్తుంది" అని పేర్కొన్నారు.ఇది కేవలం పురస్కారం మాత్రమే కాదు, మానవీయ విలువలతో కూడిన విద్యను అందించాలనే మా సంకల్పానికి దక్కిన న్యాయమైన గుర్తింపు కూడా అని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.




**జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా**

## రెడ్ క్రాస్, తాహేరా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.


రక్తదానం చేస్తున్న రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాకూబ్


రక్తదాతను అభినందిస్తున్న వైద్యులు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:**
నంద్యాల నడిగడ్డలోని రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో అప్పటి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, డాక్టర్ బి సి రాయ్ జన్మదినమైన జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా అలాగే ప్రముఖ ప్రజా వైద్యుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి జన్మదిన సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ మరియు తాహెరా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాకుబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ బాబన్, సీనియర్ మహిళా వైద్యురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి, ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ ఆరిఫా భాను, రెడ్ క్రాస్ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ముఖ్య అతిథులుగా పాల్గొనగా రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, తేలకపల్లి చైతన్య, రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, డిఎఫ్ఓ అబ్దుల్ సమీ, రాయల్ స్కూల్/నారాయణ స్కూల్ కరస్పాండెంట్ ఇషాక్ వలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబన్, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ అరిఫాబానులను ఘనంగా సన్మానించారు. అలాగే తాహారా ఎడ్యుకేషనల్ సొసైటీ, రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిబ్బంది రిజ్వానా, సుమతి, హుస్సేన్ బాషా, రేష్మ మరియు యాకూబ్ ఇషాక్ మిత్ర బృందము దాదాపు 25 మందికి పైగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటుయినప్పటి నుంచి రక్తం కొరత లేకుండా అవసరమైన వారికి సేవలు అందిస్తున్నారని, జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను కొనియాడారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యాకూబ్, ఇషాక్, వారి మిత్రులను అభినందించారు.

## నకిలీ పట్టాల కేసులో వల్లభనేనికి ఊరట

**షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన కోర్టు**

విజయవాడ, **జూలై 1ఆంధ్ర ప్రగతి :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు కోర్టులో భారీ ఉపశమనం లభించింది.. ఏలూరు జిల్లాలోని నూజివీడు కోర్టు తాజా వల్లభనేని వంశీకి బెయిల్ ఇచ్చింది.. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరు చేసింది నూజివీడు కోర్టు.. అయితే, లక్ష రూపాయలకు సంబంధించి 2 ష్యూరిటీలు, వారానికి 2 సార్లు స్టేషన్ కి రావాలంటూ షరతులు పెట్టింది.. అయితే, ఇప్పటి వరకు 10 కేసుల్లో వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు అయ్యింది.. వంశీకి అన్నీ కేసుల్లో బెయిల్ రావటంతో జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్ ఉంది.. మరోవైపు, వంశీ బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.. ప్రభుత్వ పిటిషన్‌పై రేపు విచారణ చేపట్టనుంది సుప్రీంకోర్టు.. దీంతో, రేపు ఏం జరగబోతోంది అనేది ఉత్కంఠగా మారింది..

# డాక్టర్ శ్రీ బిధాన్ చంద్రరాయ్ సేవలు చిరస్మరణీయం.

**భ్రూణ హత్యలు నివారించడం కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి. సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**

**డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, డోన్ రైల్వే హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్**



డా.బిసి రాయి గారికి నివాళి





**ఆంధ్రజ్యోతి డోన్ జూలై 01:**
జూలై 1న డాక్టర్ శ్రీ బిధాన్ చంద్రరాయ్ జయంతి మరియు ఈయన వర్ధంతి కూడ జూలై 1. వీరి జ్ఞాపకార్థం 1962 నుండి జూలై 1ని డాక్టర్స్ డే గా జరుపుతున్నారు. డాక్టర్స్ డే సందర్భంగాడోన్ రైల్వే హాస్పిటల్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ అధ్యక్షతన జూలై 1 న డాక్టర్స్ డే పురస్కరించుకోని డాక్టర్ శ్రీ బిధాన్ చంద్రరాయ్ జయంతి మరియు వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో రైల్వే వైద్యశాల సిబ్బంది , హాస్పిటల్ కి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ లిమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ కోరారు.వైద్యుడే దేవుడు.. రోగి ప్రాణాలు కాపాడే ఆపద్బాంధవుడు.. నిస్వార్థంగా వైద్య సేవలందించే వైద్యులను సాక్షాత్తు భగవత్ స్వరూపంగా కొలుస్తారు ప్రజలు. అటువంటి వైద్యవృత్తికి వన్నె తెచ్చిన శ్రీ బిధాన్ చంద్రరాయ్ జయంతి నేడు. ఆయన జన్మదినం సందర్భంగా జూలై 1ని ప్రతి ఏటా జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటారు.

**నేడు వైద్యుల దినోత్సవం సందర్బంగా డాక్టర్ బి సి రాయ్ కి ఘణ నివాళి.**
శ్రీ బిధాన్ చంద్ర రాయ్ గారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశారు. వృత్తిరీత్యా వైద్యుడైన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహనీయులు.శ్రీ బిధాన్ చంద్ర రాయ్ బీహార్ రాష్ట్రం, పాట్నా జిల్లాలోని బంకింపూర్?? లో జూలై 1 -1882 న జన్మించారు. ఈయన జాదవ్ పూర్ టి.బి.హాస్పిటల్, ఆర్.జి.ఖార్ మెడికల్ కాలేజీ, కమలా నెహ్రూ హాస్పిటల్, విక్టోరియా ఇన్స్టిట్యూట్, చిత్తరంజన్ క్యాన్సర్ హాస్పిటల్ మొదలైన సంస్థలు నెలకొల్పాడు.1926 లో ప్రత్యేకంగా మహిళల కోసం, పిల్లల కోసం చిత్తరంజన్ సేవాసదన్ అనే వైద్యశాలను ఏర్పాటు చేసాడు.మహిళలకు నర్సింగ్ శిక్షణ కోసం ఒక శిక్షణా సంస్థనూ ఏర్పాటు చేసాడు. 1943లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షునిగా నియమించబడినారు. 1948 సంవత్సరంలో జనవరి 13న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు. విద్యా, వైద్య రంగాలలో ఈయన సేవలకు 1944 లో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయబడింది. 1961 లో ఫిబ్రవరి 4 న ఈయనను భారతరత్న వరించింది. వీరి జయంతి రోజైన జూలై ఒకటినే వర్ధంతి కూడా కావడం విశేషం.ఈయన స్మారకార్థం ప్రతీ ఏడూ జూలై ఒకటవ తేదీన వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం 1962 లో ప్రకటించింది.వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి 1976 నుంచి డాక్టర్ బి.సి.రాయ్ పేరు మీద అవార్డులను ప్రధానం చేస్తున్నారు. ఈయన జూలై 1-1962న స్వర్గస్తులైనారు. సమాజానికి సేవ చేసిన మహనీయులను , అనుక్షణం స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడుస్తూ వారి అశయాలను కొనసాగించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి, డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ లు కోరారు.భ్రూణ హత్యలు నివారించడం కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి.పిసి పీఎన్‌డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టం పై ప్రజలకు డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి లు అవగాహణ కల్పించారు. వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో మన దేశం లో గణాంకాలు పరిశీలిస్తే ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతున్నది. కాలానుగుణంగా వస్తున్న మార్పులు వల్ల దంపతులు మగపిల్లాడు పుడితే బాగుంటుందని భావించడం వల్ల ఆడపిల్లల భ్రూణ హత్యలు జరుగుతున్న కారణంగా ఇలాంటి హత్యలను నిలువరించేందుకు ప్రభుత్వం 1994లో పిసి పీఎన్‌డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం పై పూర్తిస్థాయిలో అవగాహనతో అక్రమ లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై సమాచారం అందించడానికి సమాజంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఈ చట్ట అమలుకు సహకరించాలని డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. ఆడ మగ ఇద్దరూ సమానమేనని, లింగ వివక్ష చూపడం నేరమేనని అన్నారు. ఆడబిడ్డలను పుట్ట నిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దామని డోన్ రైల్వే హాస్పిటల్ డాక్టర్ నరసింహా నిషాత్, హెల్త్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పాశమైలారానికి ఎవరు బాధ్యులు ?



**జూలై 1 ఆంధ్ర ప్రగతి :**
కంపెనీ సైరన్ మోగే సమయానికి అంతా ఉత్సాహంగా తాము రోజూ పనిచేస్తున్న ఫ్యాక్టరీలో చేరారు. పొద్దున్నే సద్దికట్టుకుని వచ్చిన వారు కొందరు...ఇక్కడే టిఫిన్ చేద్దామనుకున్న వారు మరికొందరు.. రోజూలాగు డ్యూటీలో చేరారు. ఇదే తమకు ఆఖరి రోజని..తమ వారిని ఇక చూడలేమని వారు అనుకోలేదు. అలాగే కుటుంబీకులు కూడా రోజులాగానే వీడ్కోలు పలికినా...సాయంత్రానికి మళ్లీ వస్తారన్న నమ్మకంతో ఉన్నారు. కనీసం కడసారి చూపుకైనా నోచుకోలేని దుస్థితిలో ఇప్పుడు ఉన్నారు. 45 కుటుంబాలు ఛిద్రమయ్యాయి. దీనికి ఎవరు బాధ్యులు. రక్షణ చర్యలు తీసుకోకుండా యథాలాపంగా నడిపిన కంపెనీదా... లేకపోతే, నిర్లక్ష్యం వహించిన అధికారులదా అన్నది తేలాలి. ఏ ప్రమాదం జరిగినా కంటితుడుపు చర్యలు తప్ప కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. పాశమైలారం కావచ్చు, ఇండస్ట్రియల్ పార్కుల్లోనే భద్రత డొల్ల అని తేలింది. సరైన భద్రతా ప్రమాణాలు లేకుండానే ఇలాంటి వందల కంపెనీలు నడుస్తున్నాయి. పేరుకే కార్మికశాఖ ఉంది. కార్మికుల గురించి వారు పెద్ద స్పందించరు. హైదరాబాద్ క్రాస్ రోడ్డులో ఉన్న అంజయ్య భవన్‌కు వెళితే ఎన్నో దీనగాథలు కనిపిస్తాయి. కార్మికశాఖ మంత్రి కావచ్చు...అసలు మంత్రులకే తమ విధులేమిటో తెలియదు. కేవలం మంత్రి పదవులే లక్ష్యంగా పెట్టుకుని రాజ్యమేలుతున్నారు. కార్మిక శాఖను చూస్తున్న మంత్రికి ఎన్ని కర్మాగారాలు ఉన్నాయి..వాటిని సక్రంగా మెయింటెయిన్ చేస్తున్నారా లేదా తెలుసుకునే అవకాశం రాలేదు. ఎందుకంటే ఆయన పదవి చేపట్టి నెలకూడా దాటి ఉండకపోవచ్చు. అలాగని గతంలో పనిచేసిన కార్మిక మంత్రులు ఎవ్వరూ కూడా ఈ ఛాలయకు రాలేదు. పదవి ఇచ్చిన రాహుల్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం, ఇతర రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే ఆయనకు సరిపోయింది. నిజానికి ఏ మంత్రికీ తమ శాఖలో ఏముందో, ఏం జరుగుతందో తెలియదు. రాజకీయాలు తప్ప మరోటి వారికి తెలియదు. బిజెపి అధ్యక్షుడు ఎవరు..బిసియా, బ్రాహ్మణుడా అన్న చర్చ చేయడంలోనే మంత్రుల కాలం గడిచింది. చనిపోయినవారిలో ఇప్పుడు ఎందరు బిసిలు, ఎస్సీలు పోయారు, ఎంతమంది అగ్రకులాల వారు తప్పించుకున్నారో ఈ మంత్రులను అడిగి తెలుసుకోవాలి. ప్రాణానికి కులమతం లేదని తెలుసుకోవాలి. అందుకే ప్రమాదానికి గల కారణాలు వెతకాలి. కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి మరో దుర్ఘటన జరక్కుండా మంత్రి వివేక్ కార్మిక శాఖను అప్రమత్తం చేయాలి. సిగాచి లాంటి సంస్థలను జల్లెడ పట్టాలి. నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడుస్తున్నాయా లేదా అన్నది పరిశీలించాతి. ఎందుకంటే సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనలో మృతుల సంఖ్య 45కు చేరింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనం, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఇలా ఎందుకు జరిగిందన్నది ప్రాథమిక విచారణ జరగాలి. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారంటే తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వారాయి. సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది. ఇక ఇక్కడ కార్మికులే కాదు..అందులో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులు కూడా ఉన్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ప్రమాదంలో కడపజిల్లాకు చెందిన ఓ ప్రేమజంట పెళ్లి చేసుకున్న మధురజ్ఞాపకం మరువకుండానే అనంతలోకాలు పోయారు. మొన్నటికి మొన్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమాన ప్రమాద ఘటనకు సంబంధించిన విషాదం మరువక ముందే ఈ ఘటన జరగడం విచారకరం. పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని కార్మిక మంత్రి వివేక్ తెలిపారు. అధిక పనిగంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. ఫిర్యాదు చేయడం కాదు...అలా జరుగుతుందా లేదా అన్న విషయం ఆరా తీయాల్సింది కార్మికశాఖనే. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పలు రసాయన పరిశ్రమల భద్రతపై అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎక్కడైన ప్రమాదం జరిగినప్పుడే యాజమాన్యాలు పలు జాగ్రత్తలు తీసుకుంటాయి. తర్వాత భద్రతా పరమైన అంశాల జోలికి వెళ్లడం లేదు. ముఖ్యంగా రసాయన పరిశ్రమలను చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుంది. రసాయనాల మధ్య ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందుకే కంపెనీకి సంబంధించిన ఇంజినీర్లతో యంత్రాలను తనిఖీ చేయించాలి. జిల్లా అధికారులూ పరిశ్రమలను నిరంతరంగా తనిఖీ చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి, అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలకు వెళ్తుంటారు. వీరు తనిఖీలు చేసి ఏడాది నుంచి రెండేళ్ల కాలపరిమితికి అనుమతులు ఇస్తుంటారు. క్షుణ్ణంగా పరిశీలన చేయకపోవడంతో ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్వహణ ఉండాలి. ఇవి కాగితాల్లోనే కనిపిస్తాయి. ప్రతి పరిశ్రమలలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ వాహనాలు, సిబ్బంది ఉండాలి. అంతేకాదు అగ్నిమాపక సిబ్బందిని వారే నియమించుకోవాలి. ఈ కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేయాలి. కానీ ఒక్కరిని కూడా నియమించుకోలేదు. నైపుణ్యం కలిగిన కార్మికులను తీసుకోవట్లేదు. తక్కువ వేతనాలు ఇస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలనే పనిలోకి తీసుకుంటున్నారు. చిన్నచిన్న ప్రమాదాల బారినపడి కార్మికులు మృతిచెందిన విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇవన్నీ ఇకనుంచి బంద్ కావాలి. క్షేత్రస్థాయిలో ఒక్కో పరిశ్రమను అడుగడుగునా తనిఖ్ఖ చేయాలి. నిపుణుల బృందంద పరిశీలించాలి. అప్పుడే ప్రమాదాలను కొంతయినా నివారించగలుగుతామని గుర్తించాలి.

## బాలికల హాస్టల్‌ను సందర్శించా

### హాస్టల్‌లో మెనూ పాటించని వార్డెన్

### అందుకే సస్పెండ్ : అనిత

విజయనగరం, **జూలై 1 ఆంధ్ర ప్రగతి :**



: పాయకరావుపేట బీసీ బాలికల కాలేజ్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఊహించని ఘటన ఎదురైంది.. హాస్టల్‌లో బాలికలతో కలిసి భోజనం చేస్తుండగా.. ఆమె తన ప్లేట్ వైపు చూసి.. కొంత ఆశ్చర్యానికి గురయ్యారు.. దీంతో, విద్యార్థులు అంతా నవ్వారు.. అయితే, ఇక్కడే హోంమంత్రి అనిత భోజనం చేస్తుండా.. ఆమె భోజనంలో బొద్దింక వచ్చిందనే ప్రచారం జరిగింది.. ఆ వార్తలపై హోం మంత్రి అనిత.. క్లారిటీ ఇచ్చారు
సోమవారం రోజు తాను పాయకరావుపేట బీసీ బాలికల కాలేజీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశానని తెలిపిన అనిత.. విద్యార్థులకు మంచి వసతులు కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.. పాయకరావుపేట హాస్టల్ లో మెనూ పాటించలేదు. వార్డెన్ అందుబాటులో లేరు.. హాస్టల్ లో సెక్యూరిటీ కూడా లేరు.. దీంతో, వార్డెన్ ను సస్పెండ్ చేశామని తెలిపారు.. అన్ని హాస్టల్స్ ను తనిఖీలు చేయమని అధికారులను ఆదేశించామన్నారు.. అయితే, మంచిని కూడా చెడులాగ వైసీపీ వాళ్లు ప్రచారం చేస్తున్నారు.. వైసీపీ అఫిషియల్ ఫేజ్ లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.. భోజనంలో చిన్న తల వెంట్రుక కనిపించింది అన్నారు.. మరోవైపు, గత ఐదు సంవత్సరాల్లో ఒక ఎమ్మెల్యే అయినా హాస్టల్స్ కు వెళ్ళరా? అని నిలదీశారు మంత్రి అనిత.. శ్రీశైలం ప్రసాదంలో బొద్దింక అని నిన్న ప్రచారం చేశారు. ఈ రోజు భోజనంలో బొద్దింక అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. ఏదో రకంగా బురద జల్లాలని చూస్తున్నారని మండిపడ్డారు.. మేం చిత్తశుద్ధితో ఉన్నాం.. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం.. ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.. అసలు వైసీపీ వాళ్ళకు మానవత్వం ఉండదా? అధికారంలోకి రావాలి.. సీఎం కుర్చీలో కూర్చోవాలనే ఆలోచన తప్ప అని హోం మంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు..

## 76వసంతంలోకి వెంకయ్యనాయుడు

### శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు



అమరావతి **జూలై 1 ఆంధ్ర ప్రగతి :** ఏ హోదాలో ఉన్నా ప్రజాసేవే పరమావధిగా భావించడం వెంకయ్య నాయుడి ప్రత్యేకత అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశంసించారు. విశిష్ట వ్యక్తిత్వమే వెంకయ్యకు రాజకీయాల్లో ప్రత్యేకతను తెచ్చి పెట్టిందన్నారు. 76వ వసంతంలోకి అడుగు పెట్టిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లో ప్రవేశించి దేశ అత్యున్నత స్థానానికి చేరిన అరుదైన వ్యక్తి అని కొనియాడారు. వెంకయ్య మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, మరింతగా ప్రజాసేవ చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో సీఎం తెలిపారు.

## సమస్యలకు సమాధానం లేదు

### తప్పించుకునేందుకే విదేవీ యానం

### మోడీ విదేశీ పర్యటనపై జైరామ్ రమేశ్ విమర్శలు



న్యూఢిల్లీ, **జూలై 1 ఆంధ్ర ప్రగతి :** తరచుగా విదేశాలకు ప్రయాణించే సూపర్ ప్రీమియమ్ ప్రధాని ఐదు దేశాల 'విహారయాత్ర'కు బయలుదేరారని కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోడీని ఎద్దేవా చేసింది. మణిపూర్ ఉద్రిక్తతలు, భారత్ మరియు పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వాదనలు సహా నాలుగు అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రధాని మోడీ తప్పించుకుంటున్నారని మండిపడింది. ప్రధాని మోడీ నిర్ణయం వల్లే ఆపరేషన్ సిందూర్‌లో మొదటి రెండు రోజుల్లో భారత్ తిరోగమనం ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన ఆరోపణల నుండి ప్రధాని పారిపోతున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జ్ కమ్యూనికేషన్స్ జైరాం రమేష్ ఆరోపించారు. ఆపద,కష్టసమయంలోనూ కొందరు వ్యక్తులు ధైర్యంగా ముందుకు సాగుతారు. కానీ తప్పించుకునేందుకు 'తరచుగా విదేశాలకు ప్రయాణించే' మన ప్రధాని 8 రోజుల విహార యాత్రకు బయలుదేరారు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశాన్ని ఆందోళనకు గురిచేస్తున్న నాలుగు సమస్యల నుండి ఆయన పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ పట్టాలు తప్పినప్పటి నుండి, అక్కడి ప్రజలు సాధారణ జీవన పరిస్థితుల నుండి దూరమైనా ప్రధాని మోడీ ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని మోడీ నిర్ణయాల కారణంగా భారత్ కొంత మేర నష్టాన్ని ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన వార్తలపై సమాధానం చెప్పకుండా తప్పించుకునేందుకు ప్రధానిమోడీ పారిపోతున్నారని జైరాం రమేష్ మండిపడ్డారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ సమ్మిట్ పాల్గొనడంతో పాటు ఎనిమిదిరోజుల పర్యటనలో ప్రధాని మోడీ గనా, ట్రినిడాడ్, టొబాగో, అ÷-జ్గ÷ంటీనా, నమిబియాలను సందర్శించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

---------------

## సింగయ్య మృతి కేసులో జగన్‌కు ఊరట

### రెండు వారాలపాటు చర్యలు నిలిపివేత

### హైకోర్టు ఆదేశాలు

అమరావతి, **జూలై 1 ఆంధ్ర ప్రగతి :**



సింగయ్య మృతి ఘటనలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి ఊరట దక్కింది. జగన్‌తో పాటు ఇతరులపై నమోదైన కేసులో ఏపీ హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది. ఈ కేసులో రెండు వారాల పాటు తదనంతర చర్యలు తీసుకోవద్దని పోలీసులకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ జగన్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. తమ వద్ద ఉన్న వీడియో ఆధారాలు, ఇతర సాక్ష్యాలు కోర్ట్ ముందు ఉంచేందుకు రెండు వారాలు సమయం కావాలని కోర్టును అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. అయితే ఇప్పటికే ఈ కేసును బీఎన్ఎస్ కింద 105 సెక్షన్‌కు మార్చారని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. అందువల్ల తదనంతర చర్యలు, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోర్టును జగన్ తరఫు న్యాయవాదులు కోరారు. దీంతో రెండు వారాల పాటు తదనంతర చర్యలపై హైకోర్టు స్టే విధించింది. కాగా, ఇటీవల మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా సింగయ్య అనే వృద్ధుడు మృతిచెందాడు. జగన్ ప్రయాణిస్తున్న కారు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. తొలుత జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని వృద్ధుడు చనిపోయాడని వార్తలు వచ్చినప్పటికీ నాలుగు రోజుల తర్వాత జగన్ కారు కిందే సింగయ్య పడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో జగన్ సహా పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో హైకోర్టును జగన్ ఆశ్రయించారు. తమపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది.

# చరిత్రలో తొలిసారి..

## సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు!

### సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లలో కొత్త విధానం

### ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం కోటా కేటాయింపు

### జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్

**జూలై 1 ఆంధ్ర ప్రగతి :**
దేశ అత్యున్నత న్యాయస్థానం భారత సుప్రీంకోర్టు చరిత్రలో ఒక కీలకమైన, చారిత్రక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు తొలిసారిగా, తన సిబ్బంది నియామకాలు మరియు పదోన్నతుల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు రిజర్వేషన్ల విధానాన్ని అధికారికంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం దిశగా సుప్రీంకోర్టు ఒక బలమైన ముందడుగు వేసినట్లయింది.ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తూ జూన్ 24న సుప్రీంకోర్టు ఒక అంతర్గత సర్క్యులర్‌ను



జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం, రిజర్వేషన్ల విధానం జూన్ 23, నుంచే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. దీని ప్రకారం, కోర్టులో ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీ వర్గాలకు 15 శాతం, ఎస్టీ వర్గాలకు 7.5 శాతం కోటా వర్తిస్తుంది. ఈ రిజర్వేషన్ల అమలు కోసం రూపొందించిన 'మోడల్ రిజర్వేషన్ రోస్టర్', సంబంధిత రిజిస్టర్ల వివరాలను కోర్టు అంతర్గత నెట్‌వర్క్ అయిన 'సుప్‌నెట్'లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.
ఈ రిజర్వేషన్ విధానం సుప్రీంకోర్టులోని రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, ఛాంబర్ అటెండెంట్లు వంటి పలు స్థాయిల్లోని పోస్టులకు వర్తించనుంది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. విడుదల చేసిన రిజర్వేషన్ జాబితాలో ఏవైనా లోపాలు ఉన్నాయని భావిస్తే, సిబ్బంది తమ అభ్యంతరాలను నేరుగా రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.
ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి హయాంలో ఈ చారిత్రక నిర్ణయం వెలువడటం గమనార్హం. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించిన రెండో వ్యక్తిగా జస్టిస్ గవాయి చరిత్ర సృష్టించారు. ఆయన పదవీకాలంలోనే అత్యున్నత న్యాయస్థానంలో రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆ ఒక్కడ్ని ఔట్ చేస్తే చాలు

ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్ సమరానికి సిద్ధమవుతోంది టీమిండియా. సిరీస్‌లో బోణీ కొట్టాలని చూస్తున్న గిల్ సేన.. ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితుల్లో ఉంది. ఒకవేళ ఇక్కడ ఓడితే సిరీస్ కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే ఎలాగైనా ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో గెలిచి తీరాలనే పంతంతో కనిపిస్తోంది భారత్. అయితే రెండు విషయాలు జట్టును కలవరపరుస్తున్నాయి. అందులో ఒకటి బౌలింగ్ వైఫల్యం, మరొకటి ఇంగ్లండ్ బ్యాటింగ్ యూనిట్. జస్‌ప్రీత్ బుమ్రా తప్పితే మిగతా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారు. అటు ప్రత్యర్థి జట్టులోని ఓ బ్యాటర్ మనకు శనిలా దాపురించాడు. ఈ విషయంపై వెటరన్ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పందించాడు. అతడేం అన్నాడంటే..జీగా దొరికిపోతాడు. .ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్‌ను ఔట్ చేయడం మీద భారత జట్టు ఫోకస్ చేయాలన్నాడు పఠాన్. అతడ్ని ఔట్ చేస్తే సగం పని పూర్తయినట్లేనని చెప్పాడు. 'ఇంగ్లండ్ జట్టులో మోస్ట్ డేంజరస్ బ్యాటర్ బెన్ డకెట్ ఉన్నాడు. అతడు లీడ్స్ టెస్ట్‌లో అద్భుతమైన సెంచరీ బాదాడు. భారత జట్టుపై అతడు ఇప్పటికే



500కి పైగా పరుగులు కొట్టాడు. అతడు టీమిండియాకు తలనొప్పిగా మారాడు. బుమ్రా-జడేజా బౌలింగ్‌లోనూ తడబాటు, భయం లేకుండా బ్యాటింగ్ చేశాడు. భారత జట్టు అతడ్ని ఔట్ చేయడం మీద దృష్టి పెట్టాలి. అతడి కోసం ప్రత్యేకమైన వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి. అతడికి ఫుల్ లెంగ్త్‌లో బంతులు వేస్తూ ఊరించాలి. హిట్టింగ్ చేయించి ఔట్ చేయాలి. ఎల్‌బీడబ్ల్యూ రూపంలోనూ అతడ్ని పెవిలియన్‌కు పంపించొచ్చు. ఒకే లెంగ్త్‌లో బంతులేస్తే ఈజీగా దొరికిపోతాడు' అని ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు.

# పంచ్ పడితే పతకమే.. జాతీయ పోటీల్లో బాక్సర్ మీర్జా అలీ బేగ్ దూకుడు

చార్మినార్: రింగ్ లోకి దిగి పంచ్ విసిరితే ప్రత్యర్థికి చుక్కలే.. చదువుల్లోనే కాదు.. ఆటల్లోను ముందు వరుసలో ఉంటామని నిరూపి స్తున్నారు పాత బస్తీ విద్యార్థులు. మెరుగైన ప్రదర్శన ద్వారా క్రీడా లోకంలో గుర్తింపు సాధిస్తూ తోటి విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నారు. ఆటపై ఇష్టం.. నిరంతరం సాధన..ఓరిమితో కృషి చేసేవారి విజయ పరంపరకు ఆర్థిక పరిస్థితులు అడ్డురావని నిరూపిస్తున్నారు. ఒకవైపు ఆటల్లో దూసుకు పోతు.. మరోవైపు చదువులోను విశేషంగా రాణిస్తు అందరి చేతా ఔరా.. అనిపించేలా చేస్తున్నాడు మీర్జా ఆలీ బేగ్.చిన్నతనం నుంచే మీర్జా అలీ బేగ్‌కు బాక్సింగ్ అంటే ఇష్టం. కొడుకు ఆసక్తి గుర్తించిన తండ్రి.. జాతీయ క్రీడాకారుడ్కెన సయ్యద్ హాబీబ్ ముస్తాఫాను సంప్రదించాడు. మీర్జా అలీ బేగ్‌కు మెలకువలను నేర్పి అతన్ని ప్రోత్సహించాడు కోచ్. అవకాశాన్ని అందిపుచ్చుకున్న మీర్జా ఆలీబేగ్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలో పాల్గొని పతకాలు గెలుచుకున్నాడు. కోచ్ హాబీబ్ నమ్మకాన్ని నిలకబెట్టాడు. బరిలో దిగిన ప్రతి బౌట్‌లోనూ పతకాలు ఒడిసి పట్టాడు. వరల్డ్ చాంపియన్, మేటి బాక్సర్ నికత్ జరిన్ తరహా బాక్సింగ్‌లో దూసుకుపోతు తెలంగాణ రాష్ట్ర పేరును జాతియ స్థాయిలో మెరిపిస్తున్నాడు పంచ్‌పడితే శొ!!బాక్సింగ్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గనే అవకాశం దక్కించుకున్నాడు మీర్జా ఆలీ బేగ్. తండ్రి నుంచి స్ఫూర్తి పొందిన ఇతడు ఎప్పటికప్పుడు తన ప్రతిభను మెరుగులు



దిద్దుకుంటూ మరింతగా రాణించడానికి పాఠశాల అనంతరం మిగిలిన సమయాన్ని సాధన కోసం కేటాయిస్తూ రాటుదేలుతున్నాడు. పాతబస్తీ బండ్లగూడ వద్దనున్న టటసింగ్ సన్ హై స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మిర్జా ఆలీ బేగ్, 5వ తరగతి చదువుతున్నప్పటి నుంచే బాక్సింగ్‌లో సాధన ప్రారంభించాడు.తండ్రి మీర్జా జావేద్ బేగ్, చెల్లి, ఇద్దరూ క్రీడల్లో ప్రతిభావంతులే. క్రీడకారులకు దక్కుతున్న గౌరవాన్ని దగ్గర నుంచి గమనించిన మీర్జా ఆలీ బేగ్ ఎలాగైన తనూ ఈ ఆటలో సత్తాచాటాలని నిర్ణయించుకున్నాడు. ఆ దిశగా అడుగులు వేసి రెండేళ్లలో రాష్ట్ర స్థాయి పోటీల్లో తన సత్తా చాటాడు. మొదటి సంవత్సరమే బంగారు, కాంస్య పతాకం సాధించి తన పట్టుదలను నిరూపించాడు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన ప్రతిభ చాటుతూ పలువురి ప్రంశలు అందుకుంటు న్నాడు.2025 జూన్ 19 నుంచి 25వరకు హార్యానా రాష్ట్రంలోని రోహాతక్‌లో జరిగిన జాతియ స్థాయి పోటీలో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిథ్యం వహిస్తు అండర్ 52, 54, కేజీ బరిలోకి దిగి కాంస్య పతకం అందుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అనేక పోటీలో పాల్గొని బంగారు వతకాలు సాధించాడు.ఆటలో విజయం సాధించడానికి మెరుగైన ప్రదర్శన చేయడానికి నిర్దిష్ట విధానం ఏమీ ఉండదు. పట్టుదల, అంకితభావంతో ప్రయత్నిస్తే ఏ క్రీడల్లోనైనా విజయాలను సాధించవచ్చు, క్రీడల్లో గెలుపోటములు జీవితంలో కూడా ఎన్నో పాఠాలు నేర్పుతాయని కోచ్ హాబీబ్ అన్నారు.

# బంతిని నాగుపాములా తిప్పాడు

బంతిని స్పిన్ తిప్పడం అంత ఈజీ కాదు. భారత్, శ్రీలంక, పాకిస్థాన్ లాంటి ఉపఖండ పిచ్‌లపై బంతిని టర్న్ చేయడం సులువే. ఇక్కడి వికెట్లు స్లోగా ఉంటాయి కాబట్టి స్పిన్‌కు అనుకూలిస్తాయి. కానీ సౌతాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా లాంటి విదేశీ పిచ్‌లపై బంతిని తిప్పడం కష్టమే. కానీ కొందరు బౌలర్లు మాత్రం అలాంటి చోట్ల కూడా బంతిని గింగిరాలు తిప్పుతూ అందర్నీ షాక్‌కు గురి చేస్తుంటారు. జింబాబ్వే స్పిన్నర్ విన్సెంట్ మసెకెసా అలాంటి పని చేసే అందర్నీ ఆకట్టుకున్నాడు. సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్ట్‌లో ఓ నమ్మశక్యం కాని బంతితో ఆశ్చర్యపరిచాడీ స్పిన్నర్.వాటే డెలివరీ..సౌతాఫ్రికా బ్యాటర్ లుహాన్ ప్రిటోరియస్‌ను నమ్మశక్యం కాని రీతిలో ఔట్ చేశాడు మసెకెసా. ప్రొటీస్ ఇన్నింగ్స్ 34వ ఓవర్ వేసేందుకు వచ్చిన జింబాబ్వే స్పిన్నర్.. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బంతిని వేశాడు. వికెట్లకు దూరంగా పడటంతో షాట్ ఆడదామని అనుకున్నాడు ప్రిటోరియస్. అయితే పిచ్‌పై పడిన వెంటనే టర్న్ అయిన బంతి నాగుపాములా మెలికలు తిరుగుతూ వెళ్లి



స్టంప్స్‌ను చెల్లాచెదురు చేసింది. దీంతో సఫారీ బ్యాటర్ బిత్తరపోయాడు. ఇదేం బాల్ రా బాబు అంటూ షాక్ అయ్యాడు. ఈ డిస్మిసల్ చూసిన నెటిజన్స్.. వాటే బాల్ అంటూ జింబాబ్వే స్పిన్నర్‌ను మెచ్చుకుంటున్నారు. ఆసీస్ దిగ్గజం షేన్ వార్న్‌ను గుర్తుచేశాడని ప్రశంసిస్తున్నారు. ఓటమి తప్పదా? ప్రిటోరియస్‌ను వెనక్కి పంపిన విన్సెంట్ మసెకెసా మరో వికెట్ కూడా తీశాడు. అతడితో పాటు వెల్లింగ్టన్ మసకద్జా రాణించడంతో సౌతాఫ్రికా భారీ స్కోరు చేయకుండా అడ్డుకుంది జింబాబ్వే. ప్రొటీస్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత ఛేదన మొదలుపెట్టిన జింబాబ్వే.. ప్రస్తుతం 6 వికెట్లకు 150 పరుగులతో ఉంది. ఆ టీమ్ విజయానికి ఇంకో 387 పరుగులు కావాలి. చేతిలో 4 వికెట్లే ఉన్నాయి. కాబట్టి జింబాబ్వే ఓటమి దాదాపుగా ఖరారు అనే చెప్పాలి.

# ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో స్మృతి మందానల

దుబాయ్: భారత మహిళా క్రికెటర్ స్మృతి మందాన.. ఐసీసీ టీ20 ర్యాంకుల్లో టాప్ మూడవ బ్యాటర్‌గా నిలిచింది. వన్డేల్లో ఇప్పటికే వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఆమె.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో స్మృతి మందాన తన పాయింట్ల పట్టికను మెరుగుపరుచుకున్నది. ఫస్ట్ టీ20లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కావడంతో ఆ బాధ్యతలను స్మృతి మందాన పోషించింది. మందాన తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టింది. కేవలం 62 బంతుల్లోనే ఆమె 112 రన్స్ చేసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఇండియా 97 రన్స్ తేడాతో విజయం సాధించింది.లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ స్మృతి మందాన తన కెరీర్‌లో అత్యుత్తమంగా 771 రేటింగ్ పాయింట్లు సాధించింది. దీంతో ఆమె మూడవ ర్యాంక్‌లో నిలిచింది. వెస్టిండీస్‌కు చెందిన హేలే మాథ్యూస్ 774, ఆస్ట్రేలియా బ్యాటర్ బేత్ మూనీ 794



పాయింట్లతో రెండో, మొదటి స్థానల్లో నిలిచారు. భారతీయ మహిళా క్రికెటర్లలో షఫాలీ వర్మ, హర్లిన్ డియోల్.. రాణించారు. షఫాలీ వర్మ 13వ ర్యాంక్‌లో నిలిచింది. బౌలర్లలో పాకిస్తాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్.. టీ20ల్లో టాప్‌లో నిలిచింది. 44 రేటింగ్ పాయింట్లతో ఆమె అగ్ర స్థానంలో ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది.

# ప్లేయింగ్ 11లోకి తెలుగోడు

ఇంగ్లండ్ పర్యటనలో బోణీ కొట్టాలని తహతహలాడుతోంది టీమిండియా. లీడ్స్ టెస్ట్‌లో అనూహ్య ఓటమితో నిరాశకు గురైన గిల్ సేన.. ఆతిథ్య జట్టును చావుదెబ్బ తీయాలని చూస్తోంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌ను అందుకోసం వినియోగించుకోవాలని భావిస్తోంది. భారీ విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేయాలనే పట్టుదలతో కనిపిస్తోంది మెన్ ఇన్ బ్లూ. ఇందులో భాగంగానే ప్లేయింగ్ ఎలెవన్‌లో కీలక మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకోవడం ఖాయమని వినిపిస్తోంది. టీమ్‌లో ఇంకేం మార్పులు చేస్తున్నారో ఇప్పుడు చూద్దాం.. ఇద్దరు ఇన్.. ఇద్దరు ఔట్!పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ తొలి టెస్ట్‌లో అటు బౌలింగ్‌లో ఇటు బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. దీంతో అతడి స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా నితీష్‌ను దించేందుకు గంభీర్-గిల్ ప్లాన్ చేస్తున్నారట. తెలుగోడితో అవసరమైనప్పుడు కొన్ని ఓవర్లు కూడా బౌలింగ్ చేయించాలని భావిస్తున్నారట. నితీష్ రెడ్డితో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌నూ తుది జట్టులోకి తీసుకోవాలని డిసైడ్ అయ్యారని సమాచారం. పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతిని ఇచ్చి, అతడి స్థానంలో సుందర్‌ను రీప్లేస్ చేస్తారని క్రికెట్ వర్గాల్లో



వినిపిస్తోంది. లీడ్స్ టెస్ట్‌లో మిడిలార్డర్ ఫెయిలైనందున నితీష్-సుందర్‌తో ఆ విభాగాన్ని బలోపేతం చేస్తున్నారని తెలుస్తోంది. వీళ్లు బంతితోనూ మ్యాజిక్ చేయగలగడం బిగ్ ప్లస్‌గా టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోందట. ఈ రెండు మార్పులు తప్పితే ప్లేయింగ్ ఎలెవన్‌లో ఇంకేమీ చేంజెస్ చేయడం లేదని వినిపిస్తోంది.

# పారిశ్రామిక ప్రగతి.. ఫ్చ్

**న్యూఢిల్లీ,** : దేశంలో పారిశ్రామికోత్పత్తి పడకేసింది. ప్రధాన రంగాల్లో వృద్ధిరేటు మునుపటితో పోల్చితే దారుణంగా పడిపోయింది. కీలకమైన తయారీ, గనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత భారీగా క్షీణించడం గమనార్హం. ఈ ఏడాది మే నెలలో తయారీ రంగ ఉత్పాదక రేటు 2.6 శాతానికి పరిమితమైంది. గనుల రంగంలోనైతే మైనస్ 0.1 శాతంగా నమోదవగా.. విద్యుదుత్పత్తి 5.8 శాతంగా ఉన్నది. నిరుడు మే నెలలో ఇవి వరుసగా 5.1 శాతం, 6.6 శాతం, 13.7 శాతంగా ఉండటం విశేషం. ఈ క్రమంలోనే ఈసారి మే నెలలో దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 9 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 1.2 శాతం వద్దే ఆగిపోయింది. ఈ మేరకు సోమవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల్లో తేలింది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో గణాంకాలు నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక 2024 మే నెలలో ఐఐపీ 6.3 శాతంగా ఉన్నది.

2.7% కాదు 2.6 శాతమేఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించిన ఐఐపీ గణాంకాలను జాతీయ గణాం కాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సవరించింది. అంతకుముందు నెలకుగాను మే నెలలో విడుదలైన దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ వృద్ధిరేటును 2.7 శాతంగా పేర్కొన్నారు. అయితే దాన్నిప్పుడు 2.6 శాతానికి తగ్గించారు.



ఇదిలావుంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి రెండు నెలల్లో (ఏప్రిల్-మే)నూ ఐఐపీ వృద్ధిరేటు 1.8 శాతానికి దిగజారింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-మే నెలల్లో ఇది 5.7 శాతంగా నమోదైంది మరి.మార్కెట్‌లో నిస్తేజంటవైపు పారిశ్రామికోత్పత్తి క్షీణత.. మరోవైపు మార్కెట్‌లో నెలకొన్న నిస్తేజం మందగిస్తున్న వ్యాపారాలు.. దేశ ఆర్థిక వ్యవస్థను ఇప్పుడు ప్రమాదంలో పడేస్తున్నాయి. నిజానికి ఈసారి వర్షాలు ముందుగానే మొదలైనా.. ఆ తర్వాత ముఖం చాటేశాయి. అయితే మే నెలలో కురిసిన వర్షాలు గనుల రంగాన్ని దెబ్బతీశాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితీ నాయర్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'గనుల రంగంలోని కార్యకలాపాలను ముందస్తు వర్షాలు అడ్డుకున్నాయి. దీంతో ఉత్పత్తి తగ్గిపోయింది. ఈ ప్రభావం విద్యుదుత్పత్తిపైనా పడింది' అన్నారు. ఫలితంగా క్యాపిటల్ గూడ్స్ రంగంలో గణనీయమైన వృద్ధి కనిపించినా.. ఓవరాల్‌గా ఐఐపీని ఆదుకోలేకపోయిందన్నారు.

# మీమ్స్‌పై స్పందించిన కావ్య మారన్.

ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కో-ఓనర్. ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్ ఉంటే చాలు.. స్టేడియంలో ఆమె కచ్చితంగా ఉండాల్సిందే. సన్‌రైజర్స్ మ్యాచ్ సందర్భంగా ఆమె చేసే సందడి అంతా ఇంతాకాదు. బౌండరీలు, సిక్సులు, వికెట్లు తీసిన సమయాల్లో ఫుల్ ఎంజాయ్ చేస్తూ.. ఆరెంజ్ ఆర్మీ ప్లేయర్స్‌ను ఉత్సాహపరుస్తుంటారు. చప్పట్లు కొడుతూ.. స్టాండ్స్‌లో గంతులేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. ఆటలో ఆరెంజ్ ఆర్మీ ఓటమి, గెలుపు సందర్భంగా ఆమె ఎక్స్‌ప్రెషన్స్ ప్రతిసారీ హైలెట్‌గా నిలుస్తుంటాయి. ఈ ఎక్స్‌ప్రెషన్స్‌పై నెట్టింట మీమ్స్ కూడా సందడి చేస్తుంటాయి. ఈ మీమ్స్‌పై కావ్య మారన్ తాజాగా స్పందించారు.ఆట పట్ల తనకున్న మక్కువ వల్లే తాను ఎక్కువగా కెమెరామెన్ దృష్టిలో పడుతుంటానని తెలిపారు. 'క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే మా జట్టు ఆడే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తా.



సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఎక్కడ ఆడినా నేను వెళ్తాను. హైదరాబాద్‌లోనే కాకుండా అహ్మదాబాద్, చెన్నై లాంటి ప్రాంతాలకు కూడా వెళ్తుంటాను. టీమ్‌కు మద్దతు తెలుపుతాను. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ఆ సమయంలో నేను స్టాండ్స్‌లో ఎక్కడో చాలా దూరంలో కూర్చొని ఉంటా. అయినా కెమెరామెన్ నన్ను వదలడు. ఎలాగోలా కనిపెట్టి కెమెరాలో బంధిస్తాడు. అలా నా ఎక్స్‌ప్రెషన్స్ నెట్టింట మీమ్స్‌గా మారుతున్నాయి' అంటూ కావ్య మారన్

# ఏఎం గ్రీన్ చేతికి ఓరిక్స్ కార్ప్ వాటా

**హైదరాబాద్:** గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్ కంపెనీలో జపాన్‌కు చెందిన ఆర్థిక సర్వీసుల కంపెనీ ఓరిక్స్ కార్పొరేషన్‌కు గల 17.5శాతం వాటాను ఏఎం గ్రీన్ బీవీ కొనుగోలు చేయనుంది. ఈ డీల్ విలువ 128 కోట్ల డాలర్లు (రూ.11,000 కోట్లు). గ్రీన్‌కో వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఇద్దరి యాజమాన్యంలోని సంస్థ ఏఎం గ్రీన్‌కు ఈ లావాదేవీ అనంతరం గ్రీన్‌కోలో 25శాతం




వాటాలుంటాయి. గ్రీన్‌కోలో తనకు గల 20శాతం వాటాలో 17.5శాతంవాటాను ఏఎం గ్రీన్ పవర్ బీవీకి బదిలీ చేయడంతో పాటు దాని మాతృసంస్థ ఏఎం గ్రీన్ (లగ్జెంబర్గ్), సరళ్ (ఏఎంజీ లక్స్) జారీ చేసే కన్వర్టిబుల్ నోట్లలో 73.1 కోట్ల డాలర్లు (రూ.6,286.6 కోట్లు) ఓరిక్స్ కార్పొరేషన్ ఇన్వెస్ట్ చేస్తుంది. గ్రీన్‌కో దేశంలో పునరుత్పాదక ఇంధన కంపెనీలను కలిగి ఉండడంతో పాటు 10 గిగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం కూడా కలిగి ఉంది. 2021 నుంచిగ్రీన్‌కోవ్యాపార ఓరిక్స్ మద్దతు ఇస్తోంది.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' సెట్‌లో చిరంజీవి సందడి



ఏపీ డిప్యూటీ సీఎంగా రాజకీయాల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు సినిమాలను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు పవన్ కల్యాణ్. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సెట్‌కు మెగాస్టార్ చిరంజీవి నిన్న ఆకస్మికంగా విచ్చేసి సందడి చేశారు. తమ్ముడు పవన్ నటనను, చిత్రీకరణ జరుగుతున్న తీరును ఆయన దగ్గరుండి ఆసక్తిగా వీక్షించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హరీశ్ శంకర్, పవన్ కల్యాణ్‌పై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సమయంలో చిరంజీవి సెట్‌లో అడుగుపెట్టారు. పవన్ పక్కనే కూర్చుని, మానిటర్‌లో షాట్‌ను చూస్తున్న చిరంజీవి ఫొటో ఒకటి బయటకు వచ్చి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చాలా రోజుల తర్వాత అన్నదమ్ములు ఇద్దరూ ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో మెగా అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో పవన్ నిజ జీవితంలో చేసిన ఓ సంచలన సన్నివేశాన్ని దర్శకుడు హరీశ్ శంకర్ రీక్రియేట్ చేస్తున్నట్టు సమాచారం. గతంలో ఓ సందర్భంలో పవన్ కారు టాప్‌పై కూర్చుని ప్రయాణించిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే సీన్‌ను సినిమాలో పెట్టాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సీన్ కనుక సినిమాలో ఉంటే థియేటర్లలో అభిమానులతో ఈలలు పడటం ఖాయమని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

## తీవ్ర ఆర్థిక సమస్యలతో ఉన్న సినీ నటి
# పాకీజాకు పవన్ కల్యాణ్ అండ





ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సీనియర్ నటి వాసుకి (పాకీజా)కి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా నిలిచారు. ఆమె దీనస్థితి గురించి తెలుసుకుని చలించిపోయిన ఆయన, తక్షణ సాయంగా రూ. 2 లక్షలు అందజేశారు. ఈరోజు అమరావతిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పవన్ కల్యాణ్ తరఫున ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కలిసి నటి వాసుకికి రూ. 2 లక్షల చెక్కును అందించారు. ఇటీవల వాసుకి తన ఆర్థిక, అనారోగ్య సమస్యలను వివరిస్తూ, సాయం చేయాలని కోరుతూ విడుదల చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వీడియోలు పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా నటి వాసుకి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అండగా నిలిచిన పవన్ కల్యాణ్‌కు ఆమె కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు. "చిన్నవాడైనా పవన్ కల్యాణ్ ఎదురుగా ఉంటే ఆయన కాళ్లు మొక్కుతాను. నా కష్టాన్ని అర్థం చేసుకుని ఆదుకున్నారు. ఆయన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఆమె పేర్కొన్నారు. 1990వ దశకంలో పలు తెలుగు చిత్రాల్లో నటించిన వాసుకి, 'అసెంబ్లీ రౌడీ' సినిమాలో పోషించిన 'పాకీజా' పాత్రతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా, కాలక్రమేణా అవకాశాలు తగ్గిపోయి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జనసేన అధినేత ఆమెకు అండగా నిలవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆకట్టుకుంటున్న 'తమ్ముడు' రిలీజ్ ట్రైలర్




యంగ్ హీరో నితిన్ నటిస్తున్న కొత్త చిత్రం 'తమ్ముడు'. 'వకీల్ సాబ్' ఫేమ్ శ్రీరామ్ వేణు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా సినిమా రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ ఆసక్తికరంగా ఉండి, అందరి దృష్టిని ఆకర్షిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ట్రైలర్‌ను చూస్తే, ఈ సినిమా కథ మొత్తం అక్కా తమ్ముళ్ల మధ్య ఉండే బలమైన అనుబంధం చుట్టూ తిరుగుతుందని స్పష్టమవుతోంది. తన సోదరి చేత ఆప్యాయంగా 'తమ్ముడు' అని పిలిపించుకోవాలని ఆరాటపడే యువకుడి పాత్రలో నితిన్ కనిపించారు. ఆ ఒక్క పిలుపు కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడే పాత్రలో ఆయన నటన ఆకట్టుకునేలా ఉంది. భావోద్వేగభరితమైన సన్నివేశాలతో పాటు, యాక్షన్ అంశాలు కూడా సినిమాలో ఉన్నట్లు ట్రైలర్‌లో చూపించారు. ఈ చిత్రంలో నితిన్‌కు జోడీగా 'కాంతార' ఫేమ్ సప్తమీ గౌడ, వర్ష బొల్లమ్మ నటిస్తున్నారు. చాలా కాలం తర్వాత సీనియర్ నటి లయ ఈ సినిమాతో రీఎంట్రీ ఇస్తూ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.



# సంగీతమే ప్రధానంగా ప్రేమకథ

వరలక్ష్మీ పప్పుల సమర్పణలో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లు గా నటించారు. సంగీతమే ప్రధానంగా సాగే ఈ ప్రేమకథలో వచ్చే సన్నివేశాలు చాలా ఆసక్తికరం గా, నెక్స్ ఏం జరుగుతుందో అనే సస్పెన్స్‌తో దర్శకుడు భాను ఈ సినిమాను రూపొందించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్ర ఫస్ట్ లుక్, ఫస్ట్ సాంగ్‌ను చిత్ర యూనిట్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు భీమ్స్, దర్శకులు అశోక్.జి, అనుదీప్ కె.వి, భాను బోగవరుపు, కాసర్ల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐబిఎమ్ మెగా మ్యూజిక్ ఆడియో కంపెనీ ను లాంచ్ చేయడం విశేషం. ఈ సందర్భంగా నిర్మాత కనకదుర్గారావు పప్పుల మాట్లాడుతూ "అన్ని ప్రేమకథల్లోనూ ప్రేమ ఉంటుంది, కానీ ఈ ప్రేమకథలో ఆకాశమంత ప్రేమ అనంతమైన ప్రేమ ఉంటుంది. ప్రేలో ఇదివరకు ఎవ్వరూ టచ్ చెయ్యని ఒక డిఫరెంట్ పాయింట్ తో ప్రేమిస్తున్నా సినిమాను తెరకెక్కించారు దర్శకుడు భా ను"అని అన్నారు. దర్శకుడు భాను మాట్లాడుతూ "ఎన్నో చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన సాత్విక్ వర్మ ప్రేమిస్తున్నా సినిమాతో హీరోగా లాంచ్ అవుతున్నారు. అలాగే తెలుగమ్మాయి ప్రీతి నేహా హీరోయిన్ గా పరిచయం అవుతోంది. ఇద్దరూ పోటీపడి బాగా నటించారు"అని తెలిపారు.

## యంగ్ హీరో కోసం
# విదేశీ స్టంట్ మాస్టర్లు!



యంగ్ హీరో తేజ సజ్జా కథాయాకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో భారీ పీరియాడిక్ చిత్రం 'మిరాయ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు భారీగా ఏర్ప డ్డాయి. %-%హనుమాన్%-% తర్వాత తేజ పాన్ ఇండియాలో మరో బ్లాసర్ట్ కొడతాడనే అంచనాలు రెట్టింపు అవుతు న్నాయి. చెడు కారణంగా మంచి తనానికి ముప్పు వాటిల్లినప్పుడు దారి చూపించే ఓ ఆయుధం పుడుతుంది. యుగాల క్రితం అవరించిన ఓ ఆ ఆయుధమే మిరాయ్ కాన్సెప్ట్ గా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. తేజ సజ్జాపై కీలకమైన యాక్షణ్ సన్నివేశాలను చిత్రీక రిస్తున్నారు. దీనిలో బాగంగా టాలీవుడ్-హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు కలిసి పనిచేస్తున్నారు. నభాకాంత్, రాబిన్ సుబ్బుతో పాటు విదేశీ స్టంట్ మాస్టర్ల ఆధ్యర్యంలో ఈ భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇందులో కొన్ని సాహసోపేతమన సన్నివేశాల విషయంలోనే తేజ ఎక్కడా వెనక్కి తగ్గకుండా పాల్గొంటు న్నాడు. ఈ ఫైట్ సీన్ కోసం స్టంట్ మాస్టర్ల ఆధ్వర్యంలో కొంత ముందస్తు శిక్షణ కూడా తీసుకున్నాడుట. ట్రైనింగ్ అనంతరమే ఆ సన్నివేశాలు పూర్తి చేస్తున్నాడు. బాడీ లుక్ పరంగానూ తేజ మార్పులు తీసుకొ చ్చాడు. మునుపటి చిత్రం కంటే కాస్త బరువు పెరిగి మళ్లీ స్లిమ్ లుక్ లోకి మారాడు. తేజకు విలన్ గా మంచు మనోజ్ నటిస్తున్నాడు. సినిమాలో ఈ పాత్ర కూడా చాలా బలంగా ఉంటుందని ప్రచార చిత్రాలతో అర్ధమవుతుంది. ప్రతి నాయకుడి ఆహార్యంలో మనోజ్ పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాడు. హీరో ను మంచిని ఎలివేషన్ మిరాయ్ రూపంలో మనోజ్ కు

# జూలై 3న రామాయణం డి-డే



రణబీర్ కపూర్ -సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న %-%రామాయణం-1%-% 2025-26 మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో ఒకటి. నితీష్ తివారీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కొంతకాలంగా నితీష్ బృందం ప్రచార కార్యక్రమాల పరంగా స్థబ్ధుగా ఉండటంతో అభిమానుల్లో నీరసం అలుముకుంది. అయితే తాజా సమాచారం మేరకు %-%రామాయణం%-% అధికారిక టైటిల్, లోగోని జూలై 3న డిజిటల్‌గా ఆవిష్కరిస్తారని తెలిసింది. పింక్‌విల్లా వివరాల ప్రకారం.. రామాయణం లోగో లాంచ్ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కి అధికారిక ప్రకటనగా భావించవచ్చు. ఇప్పటికే తారాగణం సహా ఇతర వివరాలు వెల్లడయ్యాయి. టైటిల్ టీజర్ రాకతో ప్రాజెక్ట్ విజువల్ గ్రాండియారిటీపై మరింత స్పష్థత వస్తుంది. టీజర్ ఇప్పటికే సిద్ధమైందని తెలుస్తోంది. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ టీజర్, నితీష్ తివారీ రూపొందించిన గ్రాండ్ పౌరాణిక విశ్వంలోకి స్నీక్ పీక్ గా భావించాలి. అయితే ఈ సినిమా ఇంకా థియేటర్లలోకి రావడానికి ఏడాదిన్నర సమయం మాత్రమే ఉన్నందున, నిర్మాతలు విడుదలను వాయిదా వేస్తున్నారు. ఈ సినిమాను రెండు భాగాలుగా చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. మొదటి భాగం 2026 దీపావళికి , రెండవ భాగం 2027 దీపావళికి విడుదలవుతాయి. భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని నేటి అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుంటూ తెరపై అద్భుతంగా ఆవిష్కరించే ప్రయత్నమిదని అంతా భావిస్తున్నారు. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యష్, హనుమంతుడిగా సన్నీడియోల్ నటించారు.




# 'థాంక్యూ డియర్' టీజర్ విడుదల

మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మాతగా తోట శ్రీకాంత్ కుమార్ రచన, దర్శకత్వంలో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం థాంక్యూ డియర్. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్యపాత్రల్లో నటించారు. కాగా సెన్సేషనల్ డైరెక్టర్ వివి వినాయక్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ రియల్ స్టార్ శ్రీహరి కుటుంబం నుండి వచ్చిన ధనుష్ రఘుముద్రి హీరోగా, హెబ్బా పటేల్, రేఖా నిరోషా హీరోయిన్లుగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న థాంక్యూ డియర్ చిత్రం గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో ధనుష్ రఘుమూర్తి మాట్లాడుతూ డైనమిక్ డైరెక్టర్ వివి వినాయక్ మా సినిమా టీజర్‌ను లాంచ్ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.